
మద్దిరాలపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, భారీగా హాజరైన ప్రజలు

జనంతో మమేకం

- దగాపడ్డ కుటుంబాలకు చేయూత
- నిశిత పరిశీలన.. నిర్దిష్ట చర్యలు
- ఇది మంచి ప్రభుత్వంను ప్రజల కోసమే వినియోగించిన చంద్రబాబు

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ చేపట్టిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. దగాపడ్డ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు చేయూతనిచ్చే విధంగా నిర్వహించారు. ఎలాంటి హడావుడి లేకుండా గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపారు. హంగూ ఆర్భాటాలకు పోకుండా పేదల ఇళ్లకు వెళ్లడం, వారితో మాట్లాడటం చేశారు. దీన్ని చూసి ప్రజాపాలన అంటే ఇది కదా అని జనం చర్చించుకోవడం కన్పించింది. కాగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజల కోసం వినియోగించి అందరి మన్ననలను చంద్రబాబు పొందగలిగారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో శుక్రవారం ఆయన నిర్వహించిన కార్యక్రమం అందుకు అద్దం పట్టింది.


పింఛన్‌ను పెంచినందుకు చంద్రబాబుకు కృతజ్ఞత తెలుపుతున్న వృద్ధురాలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆరు రోజులు గ్రామాలకు వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అందులోభాగంగా ఆయన తొలిరోజు కార్యక్రమాన్ని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించి ప్రభుత్వం ప్రజాసేవకే పరిమితమన్న సంకేతాన్ని ఇవ్వగలిగారు. రమారమి రెండున్నర గంటలపాటు ఆయన ఆ గ్రామంలో గడిపారు. ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ప్రజలతో మమేకమయ్యారు. గతంలో జగన్ ముఖ్యమంత్రి హోదాలో వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు చేసే హడావుడి, ఆర్భాటాలు ఈ కార్యక్రమంలో మచ్చుకు కూడా కనిపించలేదు. గ్రామంలోని కొన్ని గృహాలకు వెళ్లిన చంద్రబాబు వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు గ్రామసభలో కూడా ప్రజలను పిలిచి మాట్లాడించి వారి పొగడ్తలకు పొంగిపోకుండా వారు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అప్పటికప్పుడు కొన్ని ప్రజోపకర నిర్ణయాలు తీసుకున్నారు.

పేద కుటుంబాలకు చేయూత

మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో హెలికాప్టర్‌లో వచ్చిన చంద్రబాబు వెంటనే మద్దిరాలపాడు గ్రామంలోకి ప్రవేశించారు. తొలుత సభ వద్దకు వెళ్లకుండా కొందరు ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా రెండు కుటుంబాల వారు చెప్పిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రత్యేకించి ఒక కుటుంబం వారు గత ప్రభుత్వంలో దగాపడిన విషయాన్ని గుర్తించి అప్పటికప్పుడు ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన ఆర్థిక సహకారాన్ని కూడా అందించే ఏర్పాటు చేశారు. తొలుత ఆయన ముస్లింల ఇంటికి వెళ్లారు. ఇంటిలోని గృహిణి షేక్ బీబీసార తాను కూలి పనులకు వెళ్తానని, తన భర్త బేల్దారి పనులకు వెళ్తాడని చెప్పింది. వెంటనే చంద్రబాబు వారి పిల్లల గురించి వాకబు చేశారు. తన కుమార్తె రజియాబేగం 10వ తరగతి వరకూ చదువుకుందని, ఆర్థిక స్తోమత లేక చదువు ఆపేసి తనతో కూలి పనులకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. కుమారుడు కరిముల్లా 9వ తరగతి వరకూ చదువుకున్నాడని, అతను చదువు ఆపించి మెకానిక్‌గా పనికి పంపుతున్నట్లు వివరించింది. ఆశ్చర్యపోయిన చంద్రబాబు పిల్లల్ని ఉద్దేశించి మీకు చదువుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించారు. వారు చదువుకోవాలన్న ఆసక్తిని చంపుకొని కూలి పనులకు వెళ్తున్నామని చెప్పారు. ఎందుకు వారిని చదివించడం లేదని బీబీసారను అడగ్గా.. గతంలో టీడీపీ ప్రభుత్వంలో 2017-18లో తమకు ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టామని, మీరు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బుల్లో రెండు బిల్లులు ఇచ్చారని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో తమకు ఒక్క రూపాయి కూడా రాలేదని, ఆ ఇంటి కోసం అప్పు చేయాల్సి వచ్చిందని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబాన్ని ఈదుకుంటూ అప్పు తీర్చుకునేందుకు పిల్లలను కూలి పనులకు పంపక తప్పలేదని వివరించారు. తర్వాత ఆమెను గ్రామసభకు పిలిపించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఇంకా వారికి రావాల్సిన రూ.65,150లను ఈరోజే ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే వారి పిల్లలిద్దరినీ చదివించే బాధ్యత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వెంటనే వారిని పాఠశాలలో చేర్చాలని ఆదేశించారు. వారి పాప రజియాబేగం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవాలనుకుంటే అవసరమైన ఏర్పాటు చేయాలని సభలో ఉన్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు సూచించారు. ఆ తర్వాత బీబీసార మైక్ తీసుకొని సీఎం ఇచ్చిన చేయూతకు హర్షం వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రావాల్సిన నిధులు ఆగిపోగా మళ్లీ మీరు వస్తే మా కల నెరవేరుతుందని ఆశించామన్నారు. తమ కల మరింత స్థాయిలో నిజం కావటంతో మాటలు రావడం లేదన్నారు. మీకు రుణపడి ఉంటామని మళ్లీమళ్లీ మీరే సీఎం కావాలంటూ కన్నీరు పెట్టుకుంటూ మాట్లాడారు.

అందరికీ ఇళ్లు మంజూరు

బీబీసార ఇంటి తర్వాత ముఖ్యమంత్రి కల్లుగీత కార్మికుడు ఆలుదాసు శ్రీను ఇంటికి వెళ్లారు. నిరుపేద అయిన తమకు అన్ని అర్హతలు ఉన్నా గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేయలేదని వారు చెప్పారు. అందరి చుట్టూ తిరిగినా పని జరగలేదని వివరించారు. పైగా తాము వాళ్ల పార్టీ కాదనే నెపంతో పక్కన పెట్టారని చెప్పారు. వాళ్లకు వెంటనే ఇంటిని మంజూరుచేయడంతోపాటు కొత్త మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేసే దుకాణంలో ఒకటి వారికి కేటాయించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇళ్లులేని వారు సుమారు 200 కుటుంబాలు ఉన్నాయని అధికారులు ఇచ్చిన నివేదికను పరిశీలించి అందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

వెంటనే ట్రై సైకిల్ ఇవ్వండి

గ్రామసభలో తనకు ఎదురుగా ప్రజల్లో ఉన్న ఒక దివ్యాంగుడిని చూసి అతడి సమస్యలను చంద్రబాబు అడిగారు. ఆయన ట్రై సైకిల్ కూడా లేని విషయాన్ని చెప్పగానే వెంటనే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు దివ్యాంగుడినైనప్పటికీ పింఛన్ రాని విషయాన్ని సీఎం దృష్టికి ఆయన తీసుకెళ్లగా నిబంధనలకు అనుగుణంగా పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఆ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వ డాక్టర్లను హెచ్చరిస్తూ గతంలో తప్పుడు సదరమ్ సర్టిఫికెట్లు ఇచ్చిన విషయం బయటకు వచ్చిందని, భవిష్యత్తులో అలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సర్పంచ్ ఆవేదన.. బాబు స్పందన

గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ స్వర్ణ అనురాధ మాట్లాడుతూ తాను ఎంసీఏ చదువుకున్నానని, గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో అనేక ప్రయత్నాలు చేశానన్నారు. విద్యుత్, తాగునీటి సమస్యపై సంబంధిత అధికారుల చుట్టూ తిరిగానని వివరించారు. ఎవ్వరూ సానుకూలంగా స్పందించకపోగా తాను తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్‌నంటూ తన ప్రతిపాదనలను తోసిపుచ్చారని భావోద్వేగంతో వివరించారు. ఈ ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే తాను పదవిలో ఉండీ వ్యర్థం అన్నట్లు మాట్లాడారు. దీనిపై స్పందించిన సీఎం.. 'మీరు నిరాశ పడకండి. మన ప్రభుత్వం అంతా మంచే చేస్తుంది. ఇది మంచి ప్రభుత్వం' అంటూ అనేక గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. సర్పంచ్ అనురాధ మరింత ఉత్సాహంగా పనిచేసే విధంగా ప్రోత్సహించి సభికుల మన్ననలు అందుకున్నారు.

హంగూ ఆర్భాటం లేకుండా..

ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటన సందర్భంగా కానీ, గ్రామసభ సందర్భంగా కానీ పోలీసుల అడ్డంకులు, నాయకులు, ప్రజాప్రతినిధుల ఆర్భాటాలు కనిపించలేదు. అధికారులు ఎంపిక చేసిన వారి ప్రసంగాలకే పరిమితం కాకుండా సభకు వచ్చిన వారిని కొందరిని పిలిచి మాట్లాడించి మా ప్రభుత్వం మీకోసం ఉంది. నిర్భయంగా ముందుకు వచ్చి పనులు చేయించుకోండి అంటూ కార్యక్రమాన్ని నిర్వహించి యావత్తు గ్రామ ప్రజల మన్ననలు పొందగలిగారు.


మద్దిరాలపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చంద్రబాబు


సీఎంకు సమస్యలపై నివేదిక అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మద్దిరాలపాడులో రైతు తాళ్లూరి శ్రీనివాసరావు కుటుంబంతో చంద్రబాబు


చంద్రబాబుకు సమస్యను చెప్పుకొని విలపిస్తున్న బీబీసార



సీఎం సహాయ నిధికి రూ.లక్ష చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న దృశ్యం


గ్రామ సభలో చిరునవ్వులు చిందిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు డోలా, గొట్టిపాటి, ఎంపీలు మాగుంట, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బీఎన్, ఉగ్ర, దర్శి ఇన్‌చార్జి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య తదితరులు

పోతేపోనీ.. ఇంకా వస్తారు

- బాలినేని విషయంపై జగన్ వ్యాఖ్య
- వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి
- ఒంగోలు లోక్‌సభ పరిశీలకుడిగా చెవిరెడ్డి
- బాపట్ల అధ్యక్షుడిగా వెంకటేష్?
- పర్చూరు ఇన్‌చార్జిగా గాదె

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'పోతేపోనీ.. ఇంకా వస్తారు. జనం నుంచి నాయకులు పుడతారు' అంటూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేయడంపై ఆపార్టీ అధినేత జగన్ స్పందించారు. అంతేకాక వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని నియమించారు. ఒంగోలు లోక్‌సభ పరిశీలకుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం జిల్లా నాయకులతో భేటీ అయిన జగన్ వేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఉండాలని కరణం వెంకటేష్‌కు సూచించారు. పర్చూరు ఇన్‌చార్జిగా మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డిని నియమించేందుకు కూడా రంగం సిద్ధం చేశారు. అయితే ఇప్పటి వరకూ ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న జంకెను సమావేశానికి పిలవకపోవడం, కనీసం మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది.

ప్రకాశం, బాపట్ల జిల్లా నేతలతో జగన్ భేటీ

బాలినేని పార్టీకి గుడ్‌బై చెప్పిన నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లిలో ప్రకాశం, బాపట్ల జిల్లాల నేతలతో జగన్ సమావేశమయ్యారు. సమావేశంలో బాలినేని అంశం ప్రస్తావనకు రాగా పోతే పోనివ్వండి. మనకు చాలామంది ఉన్నారు అని జగన్ ఈజీగా కొట్టి పారేసినట్లు తెలిసింది. మధ్యలో ఒకరిద్దరు నాయకులు బాలినేనితో మీరు మాట్లడలేదా అని అడగ్గా 'నేను చెప్పాను. పైగా జనసేనకు భవిష్యత్తు కూడా ఉండదని చెప్పాను. అయినా ఆయన వెళ్లాడు' అని చెప్పినట్లు సమాచారం. తదనంతరం జిల్లాకు కొత్త అధ్యక్షుడి నియామకాన్ని జగన్ ప్రస్తావించగా తాముంటామని ఎవ్వరూ ముందుకు రాలేదని తెలిసింది. సమావేశానికి హాజరైన ఒకరిద్దరు నాయకులు మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో బూచేపల్లి ఆ పదవికి అర్హులని సూచించారు. వారి ప్రతిపాదనపై బూచేపల్లి కూడా సానుకూలంగా స్పందించలేదంటున్నారు. అయితే జగన్ నేను చెబుతున్నా జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి, ఒంగోలు లోక్‌సభ పార్టీ పరిశీలకుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉంటారని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆ మేరకు వారి నియామకాలకు సంబంధించి అధికారిక సమాచారాన్ని కూడా రాష్ట్ర పార్టీ ప్రకటించింది. ఎస్ఎన్‌పాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నాగార్జున సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. బూచేపల్లితోపాటు వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, మాజీ మంత్రి సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి, కనిగిరి ఇన్‌చార్జి నారాయణ తోపాటు జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, సజ్జల ఆ సమావేశానికి హాజరయ్యారు.



బాపట్లకు వెంకటేష్

బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు కరణం బలరాం కుమారుడు వెంకటేష్‌ను నియమించాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఆ జిల్లా సమావేశానికి చీరాల ఇన్‌చార్జిగా ఉన్న వెంకటేష్‌తోపాటు అద్దంకి ఇన్‌చార్జి హనిమిరెడ్డి కూడా హాజరయ్యారు. పర్చూరు ఇన్‌చార్జి బాలాజీ విదేశాల్లో ఉన్నందున గైర్హాజరయ్యారు. వెంకటేష్‌ను బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఉండాలని జగన్ సూచించారు. తన తండ్రి బలరాంతోపాటు నియోజకవర్గ కార్యకర్తలతో మాట్లాడి చెబుతానని, రెండు రోజులు అధికారికంగా ప్రకటించవద్దని వెంకటేష్ చెప్పగా ఆ ప్రకటన ఆగిపోయింది. పర్చూరు ఇన్‌చార్జి బాలాజీ స్థానంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్‌రెడ్డి నియామకానికి జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నేడో.రేపో ఆయన నియామకం వెలువడనుంది.

మానవత్వం చాటుకున్న ఎస్పీ



బాధితుడి సపర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 20: మద్దిరాలపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమంలో హడావుడిగా ఉన్న ఎస్పీ ఏఆర్.దామోదర్ మానవత్వం చాటుకున్నారు. రోడ్డు పక్కన పడి ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం ఒంగోలు నుంచి ఎస్పీ కారులో మద్దిరాలపాడుకు వెళుతుండగా స్థానిక ఉడ్‌కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే తన కారు ఆపి దిగి అక్కడకు వెళ్లారు. అయితే ఆ వ్యక్తి మూర్ఛతో గిలగిల కొట్టుకుం టూ ఉండగా అతని చేతిలో తాళాలు పెట్టి స్పృహ వచ్చే వరకు అక్కడే ఉన్నారు. అ లాగే 108 వాహనాన్ని పిలిపించారు. ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చిన తరువాత తనది నెల్లూరు జిల్లా జలదంకి మండలం 9మైలు గ్రామమని తెలిపారు. తాను విజయవాడ వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా మూర్ఛ వచ్చిందని చెప్పారు. తనను ప్రాణాపా య పరిస్థితి నుంచి కాపాడిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

క్విస్‌లో ఘనంగా యువజనోత్సవం



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 20: జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల నుంచి సాంస్కృతిక, జీవన నైపుణ్యం, ప్రాజెక్టు వంటి వివిధ కార్యక్రమాల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక, జానపద, నృత్య, సంగీత, సాహిత్య పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఎస్‌వైకే యూత్ డైరెక్టర్ కమల్‌షా తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన జీఎన్‌ఎంలకు పోస్టింగ్‌లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20 : ప్రభుత్వం జారీచేసిన 115 జీవో ప్రకారం గత ప్రభుత్వంలో ఇంటెన్సిఫైడ్ జీఎన్‌ఎం శిక్షణ ఇచ్చిన ఏఎన్‌ఎంలను కలుపుకొని పీహెచ్‌సీలకు, మెడి కల్ కాలేజీలకు జీఎన్‌ఎంలుగా పోస్టింగ్‌లు ఇవ్వాలని ఏపీ ఉమెన్ హెల్త్ డిపార్ట్‌మెంట్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.మాధవి కోరారు ఒంగోలులోని ఎన్‌జీవోభవన్‌లో శుక్రవారం జరిగిన అసోసియేషన్ జిల్లాకార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఎన్‌ఎం క్యాడర్‌ను కించపరుస్తూ అవమానకంగా మాట్లాడిన రుయాహాస్పటల్ హెడ్ నర్స్ చంద్రకళపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం ఇంటి వద్దకు వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలను చులకనగా మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు మెడికల్‌శాఖకు సంబంధించిన పనులు తప్ప ఇతర ఏ పనులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు భారతి, నారాయణమ్మ, షమ్మి, ఎం.మల్లిక, సుజాత, భాగ్యలక్ష్మి, ప్రభావతమ్మ, పద్మావతి, రోజారమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

మద్దిపాడు, సెప్టెంబరు 20: మద్దిరాలపాడులో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి మద్దిపాడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు ఆధ్వర్యంలో వారు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు సారథ్యం వహించారు.

ముప్పాళ్లపాడు సొసైటీపై సెక్షన్ 51 విచారణ

» విచారణాధికారి కనిగిరి ఎస్‌డీఎల్‌సీవో థామస్

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 20 : హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంపై విచారణకు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. విచారణాధికారిగా కనిగిరి ఇన్‌చార్జి ఎస్‌డీఎల్‌సీవో థామస్‌ను నియమించారు. సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, ఆర్థిక అక్రమాలు, అవకతవకలపై ఆంధ్రప్రదేశ్ సహకార సం ఘాల చట్టం 1964 సెక్షన్ 51 ప్రకారం సమగ్ర విచారణ నిర్వహించి రెండు నెలల్లో విచారణ నివేదికను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ముప్పాళ్లపాడు సొసైటీలో భారీగా అవకతవకలు జరిగినట్లు పీడీసీసీ బ్యాంకు కనిగిరి శాఖ అసిస్టెంట్ మేనేజర్ డి.కార్తీక్ బ్యాంకు సీఈవోకు, ప్రత్యేకాధికారికి నివేదిక సమర్పించారు. దీనిపై విచారణకు ఆదేశించాలని బ్యాంకు సీఈవో కోటిరెడ్డి డీసీవోకు సిఫార్సు చేశారు. దీనిపై ఏపీ సహకార సంఘాల చట్టం కింద విచారణ నిర్వహించేందుకు బ్యాంకు సీఈవోకు డీసీవో అనుమతించారు. ముప్పాళ్లపాడు సొసైటీకి సంబంధించి 2023-24 సంవత్సరానికి ఆడిట్ నిర్వహించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు ప్రత్యేక నివేదికను ఇటీవల డీసీవో రాజశేఖర్‌కు సమర్పించారు. అందులో సొసైటీలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ ద్వారా బట్వాడా చేసిన రూ.1.68 కోట్లకు సంబంధించి 258 బాండ్లు మాయమయ్యాయని, మరో 1,299 బాండ్లకు కాలం తీరిందని పేర్కొన్నారు. అదేవిధంగా లక్షలాది రూపాయలు వివిధ మార్గాల్లో దుర్వినియోగమయ్యాయని స్పష్టం చేశారు. దీంతో ఈ సొసైటీపై సెక్షన్ 51 ప్రకారం విచారణకు ఆదేశించాలని ఒంగోలు డీఎల్‌సీవో రాజశేఖర్ డీసీవోకు సిఫార్సు చేశారు. ఈనేపథ్యంలో ఈ సొసైటీపై మొదట ఆదేశించిన సెక్షన్ 53 విచారణను రద్దుచేశారు. సెక్షన్ 51 కింద విచారణకు ఆదేశిస్తూ డీసీవో శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

తాగునీరు లేని మూగ'చింత'ల

పైపులైను పగిలిపోయి నిలిచిన సరఫరా
అలంకారప్రాయంగా ట్యాంకులు
స్కీం పునరుద్ధరణకు జలజీవన్ మిషన్ కింద రూ.22 లక్షలు ఖర్చు
అయినా నీళ్లు అందని దుస్థితి

కొండపి, సెప్టెంబరు 20: మండలంలోని మూగచింతల గ్రామంలో ప్రజలు తాగునీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ జనాభా దాదాపు 2500 మంది వరకు ఉంటారు. దాదాపు పదేళ్లక్రితమే గ్రామంలోకి తాగునీరు సరఫరా చేసేందుకు ఒకటి, ఎస్సీ కాలనీకి తాగునీరిచ్చేందుకు ఇంకొకటి రెండు వాటర్ ట్యాంకులున్నాయి. వీటికి ముసి ఒడ్డున బావి, బోరు వేసి పంప్‌హౌస్ నిర్మించారు. దాదాపు ఏడాదికాలంగా గ్రామంలోకి తాగునీరు రావడం లేదు. పంప్‌హౌస్ నుంచి వాటర్ ట్యాంకులకు వెళ్లే పైపులైన్లు పగిలిపోయాయని, అందువల్లనే నీరు రావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

జలజీవనమిషన్‌లో...

జల్‌జీవన్ మిషన్ పథకంలో 'హర్‌ఘర్‌జల్' కార్యక్రమంలో భాగంగా 2022లో కేంద్రం నిధులు 11 లక్షల రూపాయలు, రాష్ట్రం నిధులు 11 లక్షల రూపాయలు కలిపి దాదాపు 22 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆ నిధులతో పాత స్కీంకు మరమ్మతులు చేశారు. కొత్తగా పైపులైన్లు, కాలనీలో కుళాయిలు లేని 38 మందికి కొత్తగా కనెక్షన్లు ఇచ్చారు. పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేశారు కాని అప్పటి నుంచి ట్యాంకు ద్వారా చుక్క నీరు కాలనీకి ఇచ్చింది లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కూడా తాగునీరు ఇవ్వకుండా ఏమిటి ప్రయోజనమని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటిని గ్రామానికి అందించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

ఘనంగా ఎమ్మెల్యే బీఎన్ జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులు

సంతనూతలపాడు, సెప్టెంబరుకు 20: సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముందస్తు జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఒంగోలులోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న వారందరూ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ మీ అందరి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా ఆయాగ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపుతానని, అదేవిధంగా మీవంతూ సహకారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండవ జయంత్‌బాబు, నాయకులు ఆరికట్ల సుమతి, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, నర్రా నాగరాజు, దార్ల రామారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చంద్రబాబు సభకు తరలి వచ్చిన జిల్లా నేతలు





సీఎం కోసం ఎదురుచూస్తున్న మంత్రులు స్వామి, రవికుమార్, ఎంపీ మాగుంట, ప్రజాప్రతినిధులు, ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి తర్వాత తొలిసారి చంద్రబాబునాయుడు జిల్లాకు రావటంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో పాటు ఒంగోలు, బాపట్ల ఎంపీలు మాగుంట, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, కొండయ్య, నాగేశ్వరరావు, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర నాయకులు దామచర్ల సత్య, జిల్లా అధ్యక్షుడు బాలాజీ, వైపాలెం ఇన్‌చార్జి ఎరీక్షన్‌బాబు, ఇతర ముఖ్యులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు జనార్దన్, నారాయణరెడ్డి, అందుబాటులో లేనందున హాజరుకాలేదు.

సమష్టిగా పనిచేసిన స్థానిక నేతలు

కొన్ని గంటల ముందే సమాచారం ఇచ్చినప్పటికీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచనలతో నాగులుప్పలపాడు మండల నాయకులతో పాటు మద్దిరాలపాడు గ్రామ టీడీపీ నాయకులు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సమష్టిగా కృషిచేశారు. గ్రామంలో సీనియర్ నాయకుడు గుమ్మడి సాయిబాబా ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరిగాయి. మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కలిసి ముందుకు వచ్చి పనిచేశారు.

వేడుకగా అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 20: అజరామరమైన పాత్రలకు జీవం పోయటం ద్వారా అక్కినేని నాగేశ్వరరావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రముఖ పారిశ్రామికవేత్త, నగర కళాకారుల సంఘ గౌరవాధ్యక్షులు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలు నగరం కొత్తకూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఏఎన్‌ఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీవీఎన్ రీడింగ్ రూములో నాగేశ్వరరావు చిత్రగీతాలతో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయకులు బాలరాజు, హేమమాలిని, విజయ్, పూర్ణిమ పలు గీతాలు పాడారు. కీబోర్డుపై జెర్మియా, ప్యాడ్స్‌పై సురేష్, తబలాపై శివప్రసాద్, జాజ్ మోహన్ వాద్యసహకారాన్ని అందజేశారు.



ఏఎన్‌ఆర్ విగ్రహానికి మురళీకృష్ణ నివాళి



మద్దిపాడులో నివాళులర్పిస్తున్న విశ్రాంతి ఉద్యోగులు

మద్దిపాడులో..

మద్దిపాడు: అక్కినేని నాగేశ్వరరావు నటనా చాతుర్యం వరువలేనిదని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నేలటూరి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు నటరాజ కళా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవరశెట్టి యలమంద అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, అబ్దుల్ కలాం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల డిప్యుటేషన్లపై కమిషనర్ సీరియస్

నిబంధనలకు విరుద్ధమని ఉత్తర్వులు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 20 : ఉపాధ్యాయుల డిప్యుటేషన్లపై పాఠశాల విద్య కమిషనర్ ఐ.విజయరామరాజు సీరియస్ అయ్యారు. అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తయినందున ఎవరినీ డిప్యుటేషన్లు వేయవద్దని ఆదేశించారు. ఈమేరకు ఆయన జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం జిల్లాకు అందాయి. కొన్ని జిల్లాల్లో టీచర్ల డిప్యుటేషన్లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఆ ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడైనా సిఫార్సులకు, ప్రలోభాలకు లొంగి టీచర్లను డిప్యుటేషన్ వేస్తే ఆ డీఈవోకు ఆ జిల్లాల్లో అదే చివరి పనిదినం అవుతుందని హెచ్చరించారు. తన నుంచి ముందస్తు అనుమతి లేకుండా టీచర్లను ఎవరైనా డిప్యుటేషన్లు వేస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కొత్తపట్నం(ఒంగోలునగరం), సెప్టెంబరు 20: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకుని రాణించాలని కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని చెప్పారు. క్రమశిక్షతో పాటు ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, పీడీల అసోసియేషన్ మండల కార్యదర్శి సాయికిషోర్, ఫయాజ్, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, చైర్మన్ వంశీకృష్ణారెడ్డి

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సీజ్

కంభం, సెప్టెంబరు 20 : కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో ఎటువంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన బాణసంచాను ఆయా మండలాల పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కంభం సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మూడు మండలాల్లో రూ.3లక్షలకు పైగా విలువ చేసే బాణసంచాను స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. లైసెన్సు లేకుండా అక్రమంగా బాణసంచా అమ్ముతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. దీపావళి సందర్భంగా ఎవరైనా అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచినా, అమ్మకాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆయా మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సీఎం చంద్రబాబుకు 53 వినతిపత్రాలు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 20: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించేందుకు శుక్రవారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజల నుంచి 53 వినతిపత్రాలు అందినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై 11, పెన్షన్ మంజూరుకు 8, వివిధ ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సమస్యలపై 4, రోడ్లు అభివృద్ధి చేయాలని 12, ఇళ్ల మంజూరుకు 4, ఉద్యోగాల కోసం 11, విద్యుత్ సమస్యలపై 2, ఇతర సమస్యలపై 2 వినతిపత్రాలను అందించినట్లు సంబంధిత పర్యవేక్షణాధికారి వెల్లడించారు.

30న అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 20: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జట్ల ఎంపికలు ఈనెల 30న సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎ.సైమన్‌విక్టర్, కార్యదర్శి వి.చింపారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనాలన్నారు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, తైక్వాండో క్రీడలకు క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని, 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ధృవీకరణపత్రాలు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సహాయ కార్యదర్శి కె.శంకరరావును 9848125706 సెల్ నెంబరులో సంప్రదించాలని వారు కోరారు.

నేడు చౌదరి సంతాపసభ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20 : ఏఐటీయూసీ జిల్లా నాయకులుగా విశిష్ట సేవలు అందించి మృతి చెందిన సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్.చౌదరి సంతాపసభ శనివారం ఉదయం పది గంటలకు స్థానిక సీపీఐ కార్యాలయంలో జరుగుతుందని నాయకుడు ఉప్పుటూరి ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, వామపక్ష శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పీడీ అక్రమ సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 20: ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ పి.జ్యోత్స్నాదేవి అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు విద్యార్థినులు పాఠశాలకు వచ్చేక్రమంలో ఉపాధ్యాయిని మందలించారన్న నేపంతో అనేక అభియోగాలు మోపి, వ్యక్తిగత కక్షతో సస్పెండ్ చేయించడాన్ని వారు ఖండించారు. గత 13 సంవత్సరాలుగా పాఠశాలలో పని చేస్తున్నారని, పని నిబద్ధత, ప్రతిభను దృష్టిలో పెట్టుకొని టీచర్ సస్పెన్షన్‌ను రద్దు చేసి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని వారు కోరారు.

నేడు సెయింట్‌థెరిస్సా టీచర్లు, సిబ్బందికి కౌన్సెలింగ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20 : ప్రభుత్వంలో విలీనమైన ఒంగోలులోని సెయింట్‌థెరిస్సా ఎలిమెంటరీ హైస్కూలులో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బందికి శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ఉదయం పది గంటలకు స్థానిక డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని, అందువల్ల స్కూలు టీచర్లు, సిబ్బంది తమ సర్వీసు రిజిస్టర్లతో హాజరుకావా లని డీఈవో కోరారు.

రేపు నగరంలో సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20 : ఒంగోలు నగరం నెల్లూరుబస్టాండులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం జరగనున్న ఎస్సీఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సదస్సును విజయవంతం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ జరగకుండా షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఉన్న కులాలను సుప్రీంకోర్టు తీర్పుతో విడగొట్టలేరన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, కాకుమాను రవి తదితరులు పాల్గొన్నారు.

4న ఒంగోలులో జనసేన బహిరంగ సభ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20 : మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలో చేరుతున్న నేపథ్యంలో వచ్చేనెల 4వ తేదీన ఒంగోలులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ బాలనాగేంద్రయాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో జరిగే బహిరంగ సభకు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. త్వరలోనే సభవేదికను ప్రకటిస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, అయినాబత్తిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 20: భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక జీజీహెచ్‌లో నిర్వహించారు. కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ ఏడుకొండలు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటారు. ప్రతి ఒక్కరి జీవితంలో మొక్కలు పెంపకం భాగం కావాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం కారణంగా పర్యావరణం ప్రమాదంలో పడుతుందని, దీని ద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకోసం మొక్కలు నాటి భావితరాల భవిష్యత్ కోసం అందరూ పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు గణపతి, పద్మజ, వైద్యులు, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

100 రోజుల పరిపాలనపై కరపత్రాలు



మైనంపాడులో కరపత్రాలను అందజేస్తున్న అధికారులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు 100 రోజుల పరిపాలనపై సంతనూతలపాడు, మైనంపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు 100 రోజుల పాలనలో ప్రజల అభిప్రాయాన్ని, పరిష్కారం కాని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం), సెప్టెంబరు 20: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి ఆ పార్టీ నాయకులు కొత్తపట్నంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను నాయకులు పట్టపు ప్రకాశం కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పురిణి గోపి, కరుణ, జ్వాలరామ్, వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు, ఆదామ్, ఏసోబు, పురిణి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే...



వీఐపీరోడ్డులో నాలుగు రోజులుగా నిలిచివున్న వర్షపునీరు

సంతనూతలపాడు, సెప్టెంబరు 20: వర్షాలు పడితే రోడ్లపై నీరు నిలబడటం సహజం. కానీ సంతనూతలపాడులోని వీఐపీరోడ్డులో మాత్రం వర్షంపడితే వారంరోజుల పాటు నీరు నిలబడే ఉంటుంది. ఈ రోడ్డుకు సైడు కాలువలు సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో వర్షపునీరు రోజులతరబడి నిల్వ ఉండి దోమల ఉధృతి ఎక్కువ అవుతోంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు, పంచాయతీ పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీఐపీరోడ్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాపాలనకు 'వంద'నాలు

మర్రిపూడి, సెప్టెంబరు 20 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనకు పెద్దఎత్తున ప్రజామోదం లభిస్తున్నదని జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్రిపూడిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వందరోజుల పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో మెగా డీఎస్సీని ప్రకటించారన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు పింఛన్ సొమ్మును పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించడంతోపాటు ల్యాండ్ టైటిలింగ్ చట్టం, అన్న క్యాంటీన్‌ల ప్రారంభం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని కొనియాడారు. మండలంలో అధికారులతోపాటు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొనడం శుభపరిణామమన్నారు. మర్రిపూడిలో తహసీల్దార్ ఎం.జ్వాలానరసింహారావు, పన్నూరులో ఎంపీడీవో సాంబశివరావుతోపాటు టీడీపీ నాయకులు రేగుల వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, చేరెడ్డి నర్సారెడ్డి, కె మోహన్‌రావ్, శ్రీనివాసులు, చెరెడ్డి రమేష్, ధర్మవరం శ్రీనివాసరెడ్డి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



టంగుటూరు రామాలయం వీధిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు జయంత్ బాబు, విజయకుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు

టంగుటూరులో..

టంగుటూరు : టంగుటూరులో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగు రైతు రాష్ట్ర నేత బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. వీరంతా రామాలయం వీధిలో ప్రచారం చేశారు. అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతోపాటు ఉపసర్పంచ్ కసుకుర్తి భాస్కరరావు, టీడీపీ నాయకుడు జయరావు పాల్గొన్నారు. అక్కడి సంఘంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కాకుటూరివారిపాలెంలో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో సర్పంచ్ కొమ్మినేని రమణమ్మతోపాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు కమ్మ రోశయ్య, పిడికిటి యలమంద, షేక్ బ్రహ్మయ్య, గుడిపూడి రవీంద్ర, లింగాల కోటేశ్వరరావు పాల్గొన్నారు. జయవరంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ కూటమి నాయకులు యరమోసు సుధాకర్ తదితరులు ప్రచారం నిర్వహించారు. మర్లపాడులో జరిగిన ప్రచారంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు చుండూరి వేణు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్తినేని హరిబాబు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల్లో అవరోధాలు తొలగించండి

మంత్రి నిమ్మలకు వినతిపత్రం సమర్పించిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నీరుచెట్టు పెండింగ్ బిల్లుల అప్లోడింగ్ అవరోధాలు తొలగించాలని జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి 2019దాకా నీరు చెట్టుకింద చేపట్టిన బిల్లులలో 256 కోట్లను చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు బిల్లుల చెల్లింపు ప్రక్రియలో పురోగతి లేదని మంత్రి రామానాయుడుకు గోపాలకృష్ణారావు కోరారు.





























ప్రజాపాలనకు 'వంద'నాలు

● పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణ

● రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 : రాష్ట్రంలో ఉన్న పేదల సంక్షేమం కోసం ఎన్‌డీఏ కూటమి నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు మంచి చేయడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. గత వైసీపీ అందించే సామాజిక పింఛన్ 3వేలను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి 4వేలకు పెంచి ప్రజల మన్ననలు ఈ ప్రభుత్వం పొందుతోందన్నారు.. ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులను సీఎం చంద్రబాబునాయుడు రక్షణ కల్పించారన్నారు ప్రతినెలా 1వ తేదిన జీతాలు చెల్లింపు కార్యక్రమం చేపట్టారన్నారు. వరదకు గురైన విజయవాడను 10 రోజులపాటు కంటికి రెప్పలా కాపాడారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు 16,437 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా డీఎస్సీని ప్రకటించారన్నారు. పేదల ఆకలి తీర్చడానికి అన్నాక్యాంటీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీలకు 1452 కోట్లు మంజూరు చేసి పంచాయతీలకు కూటమి ప్రభుత్వం ప్రాణం పోసిందన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, కమిషనర్ వెంకటదాస్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా 'ఇది మంచి ప్రభు త్వం' కార్యక్రమాన్ని పట్టణంలోని 4వ వార్డు పరిధిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, కౌన్సిలర్ నాలి కొండయ్య, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, గుంటక వెంకటేశ్వరరెడ్డి, గాయం వెంకటనారాయణరెడ్డి, సయ్యద్ గఫార్, ఒంటెద్దు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొదిలి : ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనకు పెద్దఎత్తున ప్రజామోదం లభిస్తుందని టీడీపీ నేత కాటూరి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలో నేతపాలెం, బాప్టిస్ట్‌పాలెం, టైలర్స్‌కాలనీలలో తిరుగుతూ ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగులకు వయోవృద్ధులకు పింఛన్‌లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించడంతోపాటు లాండ్‌టైటిలింగ్ చట్టం, అన్నా క్యాంటీన్‌లు, త్వరలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రారంభంలాంటి పలు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకార ం చుట్టారని కొనియాడారు. మండలంలో అధికారులతో పాటు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ఇదిమంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంభంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

నేడు కొమరోలులో

కొమరోలు : స్థానిక కొమరోలు పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మన ప్రభుత్వం 100 రోజుల పరిపాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యాక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారన్నారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

మార్కాపురం రూరల్ : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని, నాయకులు తెలిపారు. మండలంలోని మన్నెంవారిపల్లె, నాయుడుపల్లి గ్రామాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం అధికారులు, నాయకులు కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వందరోజులలో చేసిన కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెన్షన్ లబ్ధిదారులకు ఎన్నికలకు ముందు చెప్పిన మాట ప్రకారం దివ్యాంగులకు ఆరు వేల రూపాయలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలకు పింఛన్ పెంచారన్నారు. త్వరలో ఎన్నికల హమీలో ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో పీఎస్ కాశీం, డీలర్ కందుల శ్రీనివాసరెడ్డి, నాయకులు వల్లపునేని గాలెయ్య, వెంకటరాజు, గర్ని ప్రసాద్, షేక్ బాజీ, మన్నెం వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కంభం : రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మంచిపాలన అందిస్తోందని కంభం జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కంభం, కందులాపురం పంచాయతీలలో ఏర్పాటు చేసిన 100 రోజుల ఎన్‌డిఎ పాలనపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జడ్‌పిటిసి జ్యోతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలతో ప్రజలచేత ఇది మంచి ప్రభుత్వం అనిపించుకున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు, అన్నా క్యాంటీన్‌లు, డీఎస్సీ వంటి పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కంభం మండల స్పెషల్ ఆఫీసర్ సైమన్‌విక్టర్, ఎంపీడీవో మస్తాన్‌వలి, తహసీల్దార్ కిరణ్, కార్యదర్శి బ్రహ్మయ్య, ఈవోఆర్‌డీ విజయలక్ష్మి, సర్పంచ్ బోడయ్య, టీడీపీ నాయకులు ఆరేపల్లి మల్లికార్జున్, కొత్తపల్లి శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు, సయ్యద్ అనీస్‌అహమ్మద్, దాదా, రమణ, రవికుమార్, ఖాదర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ నారాయణరావు

చిన్నగుడిపాడులో మంచి ప్రభుత్వం

పెద్దదోర్నాల : మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దారు శాంతి, గ్రామ టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సాలమ్మ, వీఆర్‌వో, గ్రామకార్యదర్శి, టీడీపీ నాయకులు దొడ్డా రాజా బాబు, గుండపనేని వెంటరత్నం, కాకర్ల ధర్మారావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



రసీదు అందజేస్తున్న హెచ్‌ఎం

తర్లుపాడు, సెప్టెంబరు 20: తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, త్వరలో జరుగనున్న వజ్రోత్సవ వేడుకలకు పూర్వపు విద్యార్థులు చేయూత నిస్తున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామంటూ పలువురు విద్యార్థులు విరాళాలు అందజేశారు. 1976-77 సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ రూ.20,075, రిటైర్డ్ హెచ్‌ఎం గోసు సుబ్బారావు రూ.20,075, ప్రొఫెసర్ ఎస్‌ఏకే జిలాని రూ.20,075, మాజీ సొసైటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలిగొండారెడ్డి రూ.25,075, పఠాన్ రెహ్మాన్ రూ.15,075, రిటైర్డ్ ఎంఈవో ఎంసీ కృష్ణారెడ్డి రూ.15,075, పెరుమాళ్ల బాలమోహన్ రూ.15,075లను ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్‌బాబుకు అందజేశారు. వజ్రోత్సవ వేడుకలకు పూర్వపు విద్యార్థులు తమవంతు సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

రైల్వే సిబ్బందికి బీజేపీ నేతల సన్మానం



రైల్వే ఎస్సైని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, సెప్టెంబరు 20 : రైల్వేభద్రత వారోత్సవాల సందర్భంగా రైల్వే సిబ్బందిని బీజేపీ నాయకులు సన్మానించారు. స్థానిక ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి ఎస్సై కె.పిచ్చిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ అల్తాఫ్‌హుస్సేన్, కానిస్టేబుళ్లను బీజేపీ నాయకులు సన్మానించారు. రైల్వే ప్రయాణికులకు, రైల్వే ఆస్తులకు భద్రత కల్పిస్తున్న రైల్వే సిబ్బందిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు చక్రం, బీజేపీ నాయకులు మారుతీప్రసాద్, క్రిష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు



అన్నదానం చేస్తున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ చైర్మన్, శ్రావణి హాస్పిటల్ అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక దివ్యాంగుల విద్యార్థులకు పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ కనకదుర్గ కుమారుడు డాక్టర్ రిషిక్ శేఖర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అన్నదానం చేశారు. వివిధ సరుకులు, సామాన్లు అందజేశారు. కార్యక్రమంలో షిరిడి సాయిబాబా స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన వక్కలగడ్డ



మంత్రి లోకేష్‌తో వక్కలగడ్డ

మార్కాపురం, సెప్టెంబరు 20: రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి తప్పక చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని మల్లికార్జున్ తెలిపారు.

నల్లగుంట్లలో పారిశుధ్య పనులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న రాజమోహన్‌యాదవ్

కొమరోలు, సెప్టెంబరు 20: మండలంలోని నల్లగుంట్ల పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో గ్రామంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆ గ్రామ టీడీపీ నాయ కులు పంకు రాజమోహన్ యాదవ్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలోని నల్లగుంట్ల, రెండు ఎస్సీపాలెంల్లోను, అయ్యవారిపల్లి, బొంతపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లపైకి మురుగు నీరురావడంతో దోమలు ప్రబలి ప్రజలు విషజ్వరాలు బారినపడే ప్రమాదం ఉందన్నారు. దీనికి అనుగుణంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. గ్రామ పంచాయతీలో ఎక్కడా వీధి దీపాలకు మరమ్మతులు చేయకపోవడంతో రాత్రిసమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.. స్పందించిన ఎంపీడీవో నరసయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని సమస్యలను సర్పంచ్ ద్వారా పరిష్కరిస్తామన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పడాలి

● ఎంపీపీ పద్మజ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20: మండల అభివృద్ధికి అధికారులు తోడ్పడాలని ఎంపీపీ గుమ్మా పద్మజ కోరారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గుమ్మా పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి అధికారుల నుంచి నామమాత్రపు స్పందనే వచ్చింది. సమావేశానికి మండల అధికారులు హాజరు కాలేదు. ఇదే సమయంలో పంచాయతీ కార్యాలయం ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో అధికారులందరూ అక్కడికి హాజరయ్యారు. మండల సమావేశానికి ద్వితీయ శ్రేణి అధికారులు హాజరయ్యారు. హాజరైన అధికారులు మండలంలో చేపట్టిన, చేపటనున్న పనుల వివరాలు తెలిపారు. అనంతరం ఎంపీపీ పద్మజ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో సమావేశం మొక్కుబడిగానే నిర్వహించారన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది.

పిల్లలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20: మహిళలకు పిల్లలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం అని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక ఇండో ఫ్యాక్టరీ ఏరియా పరిధిలోని 57, 58 కోడ్ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకొని పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు మంచి పౌష్టికాహారాన్ని పరిసరాల్లో లభించే కూరగాయలు, ఆకుకూరల్లోనే పొందవచ్చన్నారు. ఉచితంగా దొరికే మునగాకును ఎక్కువగా వినియోగించుకోవాలని, అవిశ గింజలను మొత్తటి పౌడర్ చేసుకుని రోజు ఒక స్పూన్ ఆహారంలో తీసుకుంటే కిశోర బాలికలు, మహిళల్లో రక్తహీనత తగ్గించొచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తోట రేణుక, ఏనుగుల రమణమ్మ, ఆయాలు అల్లూరమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బీఎం డిగ్రీ కళాశాల సాయం

● గూడూరి ఎరిక్షన్‌బాబుకు అందజేత



విరాళం అందజేస్తున్న బట్టు సోదరులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక బీఎం డిగ్రీ, వసంత జూనియర్ కళాశాలల యాజమాన్యం బట్టు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రిత్విక్‌రెడ్డి లక్ష రూపాయలు నగదును ఎర్రగొండ పాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుకు శుక్రవారం అందజేశారు. వారిని అభినం దిస్తూ నగదు రూపంలో కాకుండా చెక్కు రూపంలో ఇవ్వాలని బట్టు సోదరులకు సూచించారు.

వరద బాధితులకు 25 వేల సాయం

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), సెప్టెంబరు 20 : వరదలతో సర్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విజయవాడ ప్రజలకు ఎర్రగొండపాలెం ప్రైవేటు టీచర్స్, లెక్చరర్ల యానియన్ ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శుక్రవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ ఇన్‌చార్జ్ గూడురి ఎరిక్షన్‌బాబును కలిసి ఆయనకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబు వారిని అభినందించారు. కార్యక్రమంలో వై.పాలెం ప్రవేటు టీచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, టీచర్లు నానా నాగేశ్వరరావు మండ్ల సురేష్‌బాబు,అబ్దుల్లా, సలీం,మురళీ, ప్రవీణ్, శ్యాంరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర వస్తువులు అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 20 : పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని అమ్మ ఆశ్రమానికి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.గౌహర్ నిత్యవసర వస్తువులను అందించారు. ఉపాధ్యాయురాలు గౌహర్ గతంలో కూడా మూడు పర్యాయాలు ఆశ్రమంలోని వృద్దుల కోసం నిత్యవసర వస్తువులు అందించిందని ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మ కొనియాడారు.

జీతాలు ఇప్పించి ఆదుకోండి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిది నెలలుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదని, ప్రభుత్వం జీతాలు అందించి ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం కార్మికులు తహసీల్దార్ ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి బందా నరసింహలు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు లేక వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతికార్మికుడికి ప్రమాదబీమా, పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు పుష్ప, సమీర, రాధ, మౌలాబీ, జహీరాబీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిలువ చేసిన బాణసంచా సీజ్



అర్ధవీడులో స్వాధీనం చేసుకున్న బాణసంచా

కంభం, సెప్టెంబరు 20 : కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో ఎటువంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన బాణసంచాను ఆయా మండలాల పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కంభం సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మూడు మండలాల్లో మూడు లక్షలకు పైగా విలువ చేసే బాణసంచాను స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. లైసెన్సు లేకుండా అక్రమంగా బాణసంచా అమ్ముతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. దీపావళి సందర్భంగా ఎవరైనా అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచినా, అమ్మకాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆయా మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 20: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తహసీల్దార్ శాంతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులు, మండల స్థాయి అధికారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్ లాల్‌నాయక్ మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం, సమర్ధవంతంగా పనిచేయడం చట్టం ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్‌నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు లేని సమావేశం

కొమరోలు, సెప్టెంబరు 20: సమాచారహక్కు చట్టంపై స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ సెక్షన్-3 ప్రకారం ప్రజలు సమాచారాన్ని పొందడం రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కు అన్నారు. అయితే ఈ సమావేశానికి ఇటు రైతులు, అటు ప్రజలు హాజరు కాలేదు. కేవలం అధికారులు వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. దీంతో ఉన్న అధికారులతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. కార్యాక్రమంలో ఏవో రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు దాతల విరాళాలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 : పట్టణంలోని అన్నక్యాంటీన్ నిర్వహణకు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు విరాళాలు అందజేస్తున్నారు. వారంతా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతికి చెక్కులు, నగదు రూపంలో విరాళాలు అందజేశారు. వారిని అభినందించారు. అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా విరాళాలు అందించిన వారిలో పట్టణానికి చెందిన దండె బోయిన రమణ రూ.21,000, పొదలకొండపల్లెకు చెందిన చేరెడ్డి యర్రారెడ్డి రూ.10,000, పట్టణానికి చెందిన గోడి సూర్యనారాయణరెడ్డి, జెర్రిబోతుల శ్రీనివాసులు, సూరా గురువారెడ్డి, పొట్టిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిలు కలిసి రూ.16,000, కంభం మండలం తురిమెళ్ల సర్పంచ్ మాదా సుభద్ర రూ.20,000, కొమరోలుకు చెందిన పట్టాభి రామస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు పెనుగొండ వెంకట రమణ, ఆర్యమరాఠి మిత్రబృందం కలిసి రూ.10,000, బేస్తవారపేటకు చెందిన మేఘన రెస్టారెంట్ యజమాని యాగాల వెంకటేశ్వర్లు రూ.10,116, నగర పంచాయతీ పరిధిలోని చట్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన దండూరి సోమయ్య రూ.25,000 అందించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం నీరు పోసి మొక్కలు పెరిగే విధంగా సిబ్బంది చూడాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమీషనర్ వెంకటదాస్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సుపరిపాలనకు ఏపీ ప్రజల తీర్పు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20 : మంచి పాలనకు ఏపీ ప్రజలు ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఎంఎల్‌సీ అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం ఏర్పడి వంద రోజులను పురస్కరించుకొని 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని మెజార్టీని కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చారన్నారు. వారి స్ఫూర్తితో చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి వేగంగా చేస్తూ వంద రోజుల పాలనలోనే ప్రజల మన్నన పొందడం కూటమి ప్రభుత్వం ఘనత అన్నారు. గత ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కొని ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే పింఛన్లు పెంచి ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నట్లు తెలిపారు. ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీచేయనున్నట్లు ప్రకటించారన్నారు. ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన కొద్దిరోజులకే నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా సిమెంటు రోడ్ల నిర్మాణానికి మండలానికి రూ.5కోట్లు చొప్పున రూ.15 కోట్లు మంజూరు చేశారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల నాగేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, తహసీల్దారు శాంతి, ఎంఈవో మస్తాన్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఏవో జవహర్‌లాల్ నాయక్, ఈవో మోహన్‌రావు, ఆయా శాఖాధికారులు, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య చంటి, దేసు నాగేంద్ర బాబు, షేక్ సమ్మద్ భాష, ఇస్మాయిల్, భాష, జనసేన మండల అధ్యక్షులు కేతి మురళీ, బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి పాల్గొన్నారు.

సీఎంకు మాజీ సైనికుల కృతజ్ఞతలు



సమావేశమైన మాజీ సైనికులు

కంభం, సెప్టెంబరు 20 : రాష్ట్రచరిత్రలో మొదటి సారిగా మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, డైరెక్టర్ ఏపీ సైనిక్ బోర్డు వారికి కంభం మండల మాజీ సైనికుల తరపున మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు శెట్లం వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కంభంలో ఏర్పాటు చేసిన మాజీ సైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత మాజీ సైనికులకు మెరుగైన ఉపాధి, జీతభత్యాలు దొరుకుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పుల్లయ్య, సభ్యులు ప్రసాద్, పోలయ్య, మస్తాన్, స్వామికుమార్, రంగయ్య, అంకయ్యగౌడ్, పాండవులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలన

మొక్కల సంరక్షణకు తగు సూచినలిచ్చిన ఏవో

త్రిపురాంతకం, సెప్టెంబరు 20: మండలంలోని పలు గ్రామాలలో జాతీయ రహదారి వెంట వెలుగు ఆధ్వర్యంలో నాటిన మొక్కలను మండల వ్యవసాయాధికారిణి కె.నీరజ, ఏపీఎం కృపమ్మ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మొక్కలు రంగు మారడం, ఎదుగుదల ఆగిపోవడం, ఉరకెత్తడం గమనించిన ఏవో నీరజ పలు సూచనలు చేశారు. సాగర్ జలాలు విడుదల చేసిన నేపథ్యంలో కాలువలకు సమీపంలోని పొలాలకు చేరువై మొక్కలకు నీరు ఎక్కువైనందున ఉరకెత్తుతున్నాయన్నారు. దీని నివారణకు పలు చర్యలను ఏవో సూచించారు. నీటిని మొక్కల పాదులలో నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీసీ ఆంజనేయులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు



కొమరోలులో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో

కొమరోలు, సెప్టెంబరు20 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో మంచి ప్రావీణ్యంను సంపాదించాలని ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బోర్రా వెంకటరత్నంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నా రు. విద్యార్థుల్లో క్రీడల వల్ల వారికి మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. మండల స్థాయిలో జరిగే అండర్-14, 17లో ఏడు విభాగాల్లోని క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో క్రీడల ప్రారంభం

త్రిపురాంతకం : మండలంలోని మేడపి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు శుక్రవారం నిర్వహించారు. ఉత్సాహంగా సాగిన క్రీడలలో బాలబాలికలకు అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రీడలతోపాటు 100 మీటర్లు, 200 మీటర్లు 600 మీటర్ల పరుగుపందేలు, లాంగ్‌జంప్, హైజంప్ వంటి అంశాలలో పోటీలు, మండల స్థాయి ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మల్లిఖార్జునాయక్, రాజశేఖరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, అన్ని పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విజేతలు

గిద్దలూరు : గిద్దలూరులోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలు నిర్వహించినట్లు కో-ఆర్డినేటర్లు గుర్రం శోభన్‌బాబు, స్వర్ణ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అండర్-17 బాలికల కబడ్డీ పోటీలో గిద్దలూరు బాలికోన్నత పాఠశాల, ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. ఖోఖోలో పొదల కొండపల్లి ఉన్నత పాఠశాల జట్టు, బాలికల గురుకుల పాఠశాల జట్టు విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. చెస్‌లో గురుకుల పాఠశాల జట్టు, గిద్దలూరు బాలికోన్నత పాఠశాల జట్టు విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. యోగా పోటీలో ఎం.సన, కె.చందన, ఎన్.దీప్తి, పి.నాగశ్వేత విజేతలుగా నిలిచాయి. అండర్-14 100 మీటర్ల బాలికల విభాగంలో పి.వైష్ణవి, మహిమ, మల్లికలు మొదటి మూడుస్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి, అమృతవర్షిణి, మహిమ, 200 మీటర్ల పరుగుపందెంలో మల్లిక, అఖిల, స్నేహ, లాంగ్‌జంప్‌లో మహిమ, చైత్ర, శ్రీవాణి మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్-17 బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగుపందెంలో అక్షయ, హేమలత, 200 మీటర్ల పరుగు పందెంలో రోజారాణి, నీరజ, శిరీష, 400 మీటర్ల పరుగు పందెంలో నీరజ, అక్షయ, నాగేశ్వరి, లాంగ్‌జంప్‌లో అక్షయ విజయం సాధించినట్లు కో-ఆర్డినేటర్లు తెలిపారు.

మెరుగైన పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 20: ప్రజలకు మెరుగైన పాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని యడవల్లి గ్రామంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని అన్నారు. ఇంత సంక్షోభంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తున్నారన్నారు. అన్నా క్యాంటీన్‌ల ద్వారా లక్షలాది మంది పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దుచేసి ప్రజల్లో ఉన్న ఆందోళనకు తెరదించారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగ యువత కోసం సంతకం చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి బకాయిలు చెల్లించలేదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ధ్వజమెత్తారు. రైతుల కష్టాలు తెలిసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రూ.1674 కోట్ల బకాయిలను రైతులకు చెల్లించి అండగా నిలిచారన్నారు. కేవలం వంద రోజుల్లోనే ప్రజాసంక్షేమ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదంటారా అని ప్రజలను ప్రశ్నించగా, హర్షధ్వానాలతో వారు ఇది మంచి ప్రభుత్వం అంటూ సమాధానమిచ్చారు. భవిష్యత్తులో కూడా సంక్షేమ పాలన అందించేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యక్రమంలో ఆర్డీఓ జాన్‌ఇర్విన్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, కేటీఆర్, శ్యామల కాశిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: వంద రోజుల పాలనపై యడవల్లి గ్రామంలో ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అలాగే, హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం, నల్లగండ్ల, కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు, దాసరిపల్లి గ్రామాల్లో మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్) పర్యటించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అందించిన సంక్షేమ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. హనుమంతునిపాడు మండలంలో విద్య వ్యవసాయ, రవాణా రంగాలను మెరుగుపరచేందుకు ఎమ్మెల్యే ఉగ్ర చర్యలు చేపడుతున్నాట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడుములు సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, దేవిరెడ్డి రాజారామిరెడ్డి, సుమిత్ర తిరుపతిరెడ్డి, బాలు, గుమ్మా కొండయ్య, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే అభివృద్ధికి రెక్కలు

పామూరు, సెప్టెంబరు 20: సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకొందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు 86వ జయంతి వేడుకలు మండలంలోని మోపాడు, బొట్లగూడూరు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మోపాడులోని



పామూరు: ఇరిగినేని ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఉగ్ర

ఇరిగినేని ఘాట్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు, ఇరిగినేని తనయుడు రవీంద్రబాబుతో కలిసి డాక్టర్ ఉగ్ర ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోపాడు, బొట్లగూడూరులోని ఇరిగినేని విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనహృదయనేత ఇరిగినేని ప్రేరణతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజాసేవ చేస్తున్నానని అన్నారు. పరిపాలన చేతకాని జగన్ ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడమే తప్ప గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి లేద న్నారు. కనిగిరి నియోజక వర్గంలో 75 వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు.

కార్యక్రమాల్లో యారవ శ్రీనివాసులు, డాక్టర్ కోటపాటి కార్తీక్, పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎం.హుసేన్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, జనసేన నాయకుడు వై.రహీముల్లా, తెలుగుమహిళలు ఓ.సుబ్బమ్మ, ఎం.రమాదేవి, ఈశ్వరమ్మతోపాటు నాయకులు, ఇరిగినేని అభిమానులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బొట్లగూడూరు, కంభాలదిన్నె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీనివాసలు, రఫీ, ఏలూరి నరసింహారావు, చుంచు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కేతు శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదయిర్లపాడులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రజలకు ఉపయోగకరమైన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మోడి వెంకటేశ్వర్లు

క్రీడలతో మానసిక ఉల్లాసం

దొనకొండ, సెప్టెంబరు 20: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని వెలికితీసేందుకు ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తుందని టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దొనకొండ జడ్పీ పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు పర్యవేక్షణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నేతృత్వంలో నిర్వహించిన క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా భావించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్నీ జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సెయింట్ ఆంథోనీస్, సాయి విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటిని అందించడమే ఫౌండేషన్ లక్ష్యం

పామూరు, సెప్టెంబరు 20: రక్షిత మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడటమే జేఆర్‌కే ఫౌండేషన్ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అన్నారు. శుక్రవారం మండలంలోని బొట్లగూడూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు తన జేఆర్‌కే ఫౌండేషన్ ద్వారా రూ.2.50 లక్షలతో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.బాల, రవీంద్రబాబు, యారవ శ్రీను, డాక్టర్ కోటపాటి కార్తీక్, గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఇనిమెర్ల గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ దప్పుకొట్టు అమీర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఉగ్ర శుక్రవారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు.

దేవస్థానంలో టీవీ మాయం

పామూరు, సెప్టెంబరు 20: స్థానిక మదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి భక్తులు ఇచ్చిన టీవీ మాయం కావడంపై ఈవో శ్రీగిరిరాజు నరసింహా బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, వల్లీ భుజంగేశ్వర ఆలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం అర్చకులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలంటు అర్చకులకు హితవు పలికారు.

నేడు వెదుళ్లచెరువులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

వెలిగండ్ల, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం మండలంలోని వెదుళ్ళచెరువులో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ నాయకుడు శ్యామల కాశిరెడ్డి తెలిపారు. శుక్రవారం వెలిగండ్లలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. గ్రామంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. సమావేశంలో కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, రాజరత్నం, మీనిగ కాశయ్య, కేసరి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, సెప్టెంబరు 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మాధవీలత అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. జ్వరం మూడు రోజులుగా తగ్గకుంటే తక్షణమే వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని తగు చికిత్స పొందాలన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత అధికంగా ఉన్నందునే దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు అధికంగా వస్తున్నాయన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలపట్ల ప్రజల ఆందోళన చెందవద్దన్నారు. వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలన్నారు. వైద్యసిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో మందుల కొరతలేకుండా చూసుకోవాలన్నారు. జ్వరపీడితులు రాగానే తగు పరీక్షలు జరిపి చికిత్సలు చేయాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ముండ్లమూరు, సెప్టెంబరు 20: ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, దర్శి ఎస్‌ఐ ఎం.మురళీ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిమ్స్ ఆస్పత్రి వైద్య బృందం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించటం హర్షనీయమన్నారు. ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలని చెప్పారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో దర్శి ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.గురవయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిషోర్, పాలెపోగు డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 20: రాష్ట్రం విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రాత్రింబవళ్లు పనిచేసి సంక్షేమాన్ని అందించిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రజారంజకంగా పాలిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.వెయ్యి పెంచి ప్రతినెలా క్రమం తప్పకుండా రూ.4వేలు చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం సమానంగా ముందుకు సాగుతున్నాయని ఆమె వివరించారు. వారి స్ఫూర్తితో దర్శి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, బొట్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ అంటిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, పిచ్చయ్య

ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని గుర్తించండి

దొనకొండ, సెప్టెంబరు 20: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అందించిన సంక్షేమాన్ని గుర్తించాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం దొనకొండలో ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం అందించిన కొన్ని ప్రధాన కార్యక్రమాలతో కూడిన కరపత్రాలు ప్రజలకు వివరించారు. టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఐలూరి పిచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శులు డేవిడ్, రామునాయక్, సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహిద్, లక్ష్మణ్, సద్దాం, షేక్ ఫయాజ్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల సంతృప్తి

తాళ్లూరు, సెప్టెంబరు 20: మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వంద రోజుల పనితీరుపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై అన్నివర్గాల ప్రజలకు సంతృప్తి నిచ్చిందన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలస్తూ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారని చెప్పారు. పెన్షన్లు పెంచి వృద్ధులు, దివ్యాంగులకు అందజేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులు, టీడీపీ యువనేత ఐ.శ్రీనివాసరెడ్డి , టీడీపీ క్లస్టర్ కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.



దర్శిలో కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు

దర్శిలో భారీ వర్షం

దర్శి, సెప్టెంబరు 20: దర్శి ప్రాంతంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలో రోడ్లు జలమయమయ్యాయి. సుమారు గంటసేపు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షంతో మెట్టపైర్లకు ఎంతో మేలు చేకూరుతుంది. కంది, సజ్జ తదితర పైర్లు సాగుచేసిన రైతులు కొన్నిరోజులుగా వర్షం లేక ఆందోళన చెందుతున్నారు. ఈవర్షంతో పైర్లు జీవం పోసుకొని దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

మెట్ట పైర్లకు జీవం

ముండ్లమూరు, సెప్టెంబరు 20: మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, కెల్లంపల్లి, పెద ఉల్లగల్లు, పులిపాడు, ఈదర, భీమవరం, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, తమ్మలూరు, నాయుడుపాలెం, చింతలపూడి, వేములబండ, కమ్మవారిపాలెం, వేముల, సింగనపాలెం, వేంపాడు, పోలారం, శంకరాపురం గ్రామాల్లో దాదాపు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షం మిరప, వైట్ బర్లీ, కంది, పత్తి పైర్లకు జీవం పోసింది.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పామూరు, సెప్టెంబరు 20: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



నీటి ఇబ్బందులను చైర్మన్‌కు వివరిస్తున్న 14వ వార్డు ప్రజలు

కనిగిరి, సెప్టెంబరు 20: ప్రజలు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ ఏఈ కోటేశ్వరరావును ఆదేశించారు. స్థానిక 14వ వార్డు చాకలి బజారులో మున్సిపల్ చైర్మన్ శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా వార్డు ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఏఈని పిలిపించి మరమ్మతులకు గురైన నీటి పైపులైను బాగు చేయించి వార్డు ప్రజలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా పైపులైన్లు వేసి కుళాయిలు ఎక్కడెక్కడ అవసరమో పరిశీలించాలని సూచించారు. కార్యక్ర మంలో వార్డు కౌన్సిలర్ దేవికి సత్యవతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్, మన్సూర్, కోమటికుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు అధిక నిధులు విడుదల చేయాలి

దర్శి, సెప్టెంబరు 20: దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధిక నిధులు విడుదల చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. ఈమేరకు శుక్రవారం సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి బొకే అందజేశారు. అవసరమైన పనులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రానికి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.18.5 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఆ పనులు పునఃప్రారంభం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించి న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

నిర్మాణం పూర్తి చేసి అన్నా క్యాంటీన్ ప్రారంభానికి నిధులు విడుదల చేయాలని సీఎం చంద్రబాబుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. దర్శి నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మూలనపడ్డ ఆర్‌వో ప్లాంట్లు

» తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తాళ్లూరు, సెప్టెంబరు 20: విద్యార్థులకు తాగునీటి కోసం ఏర్పాటుచేసిన ఆరో ప్లాంట్లు పడకేశాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరులోని ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతి గృహాల్లోని ఆర్‌వో ప్లాంట్లు పనిచేయడంలేదు. ఆయా వసతి గృహాల్లో గల ఆర్‌వో ప్లాంట్‌లు ఐదేళ్ల క్రితం చెడిపోయినా వాటి మరమ్మతుల గురించి పట్టించుకోవడంలేదు. వసతి గృహాల్లో బాలబాలికల కోసం లక్షలాది రూపాలు వెచ్చించి ఆర్‌వో ప్లాంట్‌లు ఏర్పాటుచేశారు. కొన్నిరోజులపాటు ఇవి పనిచేశాయి. ఐదేళ్ల క్రితం వసతి గృహాల్లోని ఆర్‌వో ప్లాంట్‌లు చెడిపోయాయి. అప్పటినుంచి నేటివరకు వాటిని మరమ్మతులు చేయించిన దాఖలాలులేవు. ఆర్‌వో ప్లాంట్ పరికరాలు గదుల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో వాటి మరమ్మతులకు తక్కువ ఖర్చు తక్కువయ్యేది. సంవత్సరాల తరబడి మరమ్మతులు చేయించక పోవటంతో అవి పూర్తిగా పాడయ్యాయి. దీంతో మరమ్మతుల ఖర్చు రెట్టింపు అయింది. వసతి గృహాలలోని విద్యార్థులకు మంచినీరు అందించేందుకు వార్డెన్లు సొంత నిధులు వెచ్చించి గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ల నుంచి తెప్పించి మంచినీరు అందిస్తున్నారు. వాటర్ ప్లాంట్లు పనిచేయనప్పుడు వసతి గృహాలలోని బోరు నీటినే సేవిస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌వో ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.



బాలికల వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్ పరికరాలు



బాలుర వసతి గృహంలో డ్రమ్ముల్లో నింపుతున్న మంచినీరు

గంజాయి మత్తులో యువత

» కనిగిరిలో గుట్టుగా విక్రయాలు

» పట్టించుకోని పోలీసులు

కనిగిరి, సెప్టెంబరు 20: కనిగిరిలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత గంజాయి సేవిస్తూ పెడద్రోవ పడుతున్నారు. గుట్టుగా గంజాయి విక్రయించే ముఠా కనిగిరిలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. వైజాగ్, బెంగుళూరు, తెలంగాణ ప్రాంతాల నుంచి విరివిగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు నిఘా వైఫల్యంతో పట్టణంలో విస్తారంగా అమ్మకాలు జరుగుతున్నాయి. కనిగిరి ప్రాంతంలోని కొండ దిగువ వద్ద, శివారు ప్రాంతాలతోపాటు దొరువు వద్ద గంజాయి పొట్లాలు అమ్ముతున్నట్లు నగరంలో చర్చ జరుగు తుంది. గంజాయి సేవించిన యువత అల్లర్లకు పాల్పడుతున్నారు. మత్తుగా గంజాయి సేవించిన యువత చిన్నపాటి వివాదాలకే రెచ్చిపోయి ఎదుటివారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నారు. పామూరు బస్టాండు వద్ద ఉన్న ఓ హోటల్‌లో సర్వర్ ఆహారం త్వరగా తీసుకురాలేదని ముగ్గు రు యువకులు సర్వర్‌ను రక్తం వచ్చేట్లు దాడి చేశారు. సర్వర్ హోటల్ నుంచి బయటికి వచ్చి రోడ్డుపై పరుగులు పెడుతున్నా తరమితరిమి కొట్టినట్లు తెలుస్తుంది. వారిని అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన పోలీస్ కానిస్టేబుళ్లను కొట్టినట్లు సమాచారం. ఈఘటనలో సర్వర్ తలకు, ముఖానికి గాయమై సర్జరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వర్‌పై దాడి చేసిన వారు గంజాయి సేవించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు శాఖ కనిగిరిలో గంజాయి అమ్మకాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


సంతమాగులూరు : మిన్నేకల్లులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

ప్రజల వద్దకు.. పాలకులు


భట్టిప్రోలు: వెల్లటూరులో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


పిట్టలవానిపాలెం: గోకరాజువారిపాలెంలో ఇదిమంచి ప్రభుత్వం అనే కరపత్రాన్ని అంటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

- కోలాహలంగా.. ఇది మంచి ప్రభుత్వం
- తొలి రోజు ప్రజల నుంచి అనూహ్య స్పందన
- పంచాయతీలు, వార్డుల్లో ఉత్సాహంగా కార్యక్రమాలు
- పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ల ఏర్పాటుపై హర్షాతిరేకాలు
- నియోజకవర్గాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- సంక్షోభంలోనూ చంద్రబాబు వల్లే సంక్షేమం, అభివృద్ధి అన్న నేతలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచి చేశాం.. ప్రజల నుంచి మెప్పు పొందాం.. ఆ మంచిని చెప్పుకుందాం.. ప్రజల సమస్యలు తెలుసుకుందాం.. అంటూ ప్రజల వద్దకు పాలకులు వచ్చారు. ఇది మంచి ప్రభుత్వం పేరుతో.. ప్రజల హర్షాతిరేకాల మధ్య ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం జిల్లా అంతటా కోలాహలంగా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతో పాటు అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొననున్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలు.. ప్రజాహిత.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు. తొలి రోజు శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. రోజుకో గ్రామం, మున్సిపాల్టీలో ఒక వార్డు సందర్శించాలని ప్రభుత్వం ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ ప్రకారం గ్రామం, వార్డుల్లో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేసి, మన మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజావేదిక నిర్వహించిన ఎమ్మెల్యేలు ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఉత్సాహ వాతావరణంలో కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పింఛన్ పెంపుదలపై అవ్వాతాతలు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. పట్టణాల్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో కడుపు నింపుకుంటున్న పేదలు సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ నిర్వహణపై యువత ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యేలు ప్రజలకు భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక సంక్షేమ పథకాలు అమలులోకి రానున్నాయని ప్రజలకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించి వారం రోజులపాటు ఈ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, పార్టీల శ్రేణులు వివరించనున్నాయి.

- సంతమాగులూరు మండలం మిన్నేకల్లు గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు కలెక్టర్ వెంకటమురళి పాల్గొన్నారు. గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వాటిని బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని కలెక్టర్ తెలిపారు. సంకల్పం, చిత్తశుద్ధితో అతి తక్కువ కాలంలోనే అనేక విజయాలు సాధిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో సమర్థంగా పనిచేసి ప్రభుత్వం ప్రజల మన్ననలందుకుందని తెలిపారు.
- మార్టూరు మండల పరిధిలోని జొన్నతాళి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి సీఎం చంద్రబాబు ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకున్నారన్నారు.
- భట్టిప్రోలు మండలం వెల్లటూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన గురించి వివరించారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల నుంచి ప్రశంసలు అందుకుందన్నారు.
- పిట్టలవానిపాలెం మండలం గోకరాజువారిపాలెంలో జరిగిన కార్యక్ర మంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. అరాచక పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్యం వైపు కూటమి ప్రభుత్వం పరుగులు తీస్తుందన్నారు.
- చీరాల మున్సిపాలిటీ పరిధిలోని మరియంపేటలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొని వంద రోజుల పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్ర 2024 దృష్టిలో ఉంచుకుని మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన చెప్పారు.
- రేపల్లె నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నేతలు ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు.


మార్టూరు: జొన్నతాళిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


చీరాల : మరియంపేటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


కారంచేడు మండల పరిధిలో ఎండిపోయిన వరి పైరు

సాగునీటి కోసం..

- నర్సాయపాలెం లాకులు ఎత్తిన కారంచేడు రైతులు
- నీటిని దిగువకు పంపిస్తే తమ పరిస్థితి ఏమిటన్న బాపట్ల రైతులు
- ఇరుపక్షాల రైతులతో సమావేశమైన నీటిపారుదల శాఖ అధికారులు
- మంత్రి నిమ్మల సూచనలతో సమస్యను పరిష్కరించిన యంత్రాంగం

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు వారాల క్రితం వరదలు ముంచెత్తగా ప్రస్తుతం సాగునీరు అందక పంటలు ఎండిపోయే విచిత్ర పరిస్థితి కొమ్మమూరు కాల్వ పరిధిలోని కృష్ణా పశ్చిమ డెల్టా చివరి ఆయ కట్టు రైతులు ఎదుర్కొంటున్నారు. కొమ్మ మూ రు కాల్వకు పూర్తి సామర్థ్యం మేరకు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే బాపట్ల, పర్చూరు, చీరాల పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరందుతుంది. అయితే అధ్వానంగా మారిన కాల్వలు, అధికారుల మధ్య సమన్వ య లోపంతో చివరి ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. దిగువకు నీరు వదలక పోవడంతో పర్చూరు నియోజకర్గ పరిధిలోని దాదాపు 90,000 ఎకరాల ఆయకట్టు ప్రమా దంలో పడింది. దీంతో కారంచేడు, స్వర్ణ, కుంక లమర్రు నుంచి రైతులు శుక్రవారం బాపట్ల మండలం నర్సాయపాలెం లాకుల వద్దకు చేరుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి పంపిణీలో అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో కారంచేడు నుంచి వచ్చిన రైతులు నర్సాయ పాలెం లాకులను ఎత్తి నీటిని దిగువకు విడు దల చేశారు. కారంచేడు కాల్వలో 6 అడుగుల మేర నీటి ప్రవాహం ఉంచా లని రైతులు డిమాండ్ చేశారు. అదే సమయంలో బాపట్ల మండల పరిధిలోని రైతులు కూడా అక్కడికి వచ్చారు. నీటిని దిగువకు పంపిస్తే తమ పొలాల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇరు ప్రాంతాల రైతులు మొహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈఈ మల్లికార్జున రావు, బాపట్ల జేఈ సాంబశివరావు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పంటలు ఎండిపోతున్నాయని కారం చేడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తే కాల్వ గతంలో మాదిరిగా గండ్లు పడుతాయనే దశలవారీగా నీటి విడుదలను చేపడుతున్నట్లు అధికారులు రైతులకు చెప్పారు.

మంత్రి ఆదేశాలతో..

సాగునీరందక ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన రైతులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిని 24 గంటల్లో చక్కదిద్దాలని అధికారులను ఆదే శించారు. సాగునీటిని అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అధి కారులను హెచ్చరించారు. కొమ్మమూరు కాల్వ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేసి కారంచేడు కాల్వలో నీటి ప్రవాహం 6 అడుగులు ఉండేలా చూడడంతో పాటు ఇటు నర్సాయపాలెం లాకుల వద్ద 5.5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేలా చూస్తామని, తద్వారా చివరి ఆయకట్టుకు కూడా నీరందుతుందని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాలతో లాకుల వద్దే రాత్రి వరకు ఉన్న అధికారులు దిగువకు నీటిని విడుదల చేయడంతో పాటు బాపట్ల మండల పరిధిలోని రైతులకు కూడా అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టారు


నర్సాయపాలెం కాల్వ లాకులను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న కారంచేడు రైతులు

ప్రణాళిక లోపం.. రైతుల మధ్య విద్వేషాలు

కాల్వకు పడిన గండ్లు మరమ్మతులకు తోడు అధికారులకు నీటి విడుదలలో సరైన ప్రణా ళికలు కొరవడడం కూడా ప్రస్తుతం పరిస్థితి చేయి దాటడానికి కారణంగా ఉంది. నీటి విడుదలలో ఎగువన ఉన్న కాల్వలకు, దిగువన ఉన్న కాల్వల మధ్య సమన్వయం విషయంలో అధికారుల బాధ్యతా రాహిత్యం కనబడుతోంది. బాధ్యత తీసుకోవాల్సిన జలవనరుల శాఖ అధికారులు ఒకరి మీద ఒక రు నెపం వేసుకుని నీటి అవసరాలకు కావాల్సిన సిఫారసులను పై అధికా రులకు పంపించి వాటిని సాధించుకోవడంలో విఫలమవడం కూడా ప్రస్తుత దుస్థితికి కార ణంగా ఉంది. పర్చూరు నియోజకవర్గ రైతుల డిమాండ్ మేరకు బాపట్ల పరిధిలోని కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేసి దిగువకు పంపించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టడంతో ఇక్కడి రైతులు అభ్యంతరం వెలిబుచ్చారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పిండి పదార్థాలు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్‌తో కూడిన పోషకాహారం అందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండల విద్యాశాఖాధికారులతో శుక్రవారం వర్చువల్ విధానంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడిలోనే మంచి భోజనం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహణపై రాష్ట్ర పభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని తెలిపారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాలలను అధికారులు సందర్శించి పరిసరాలను, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహణపై అభిప్రాయాలు, సూచనలు స్వీకరించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలియపర్చాలన్నారు. మండలాలు నుంచి వచ్చే సూచనల మేరకు మార్పులు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, ఏఎస్‌వో సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగిలా.. సిండికేటా

- మద్యం దుకాణాలపై మంతనాలు
- త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్
- అప్పుడే రంగంలోకి నేతల అనుయాయులు

చీరాల, సెప్టెంబరు 20: రెండు, మూడు రోజుల్లో మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతో కొత్తవారితో పాటు, ఆ రంగంలో గతంలో ఉన్నవారు ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. వారి వెనుక కూటమి నేతల అనుయాయులు చక్రం తిప్పేందుకు కసరత్తు చేస్తున్నారు. మద్యం దుకాణాలను పొందేందుకు సింగిల్‌గా పోదామా, సిండికేట్‌గా పోదామా అనే విషయంపై ఆయా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. సేల్స్ ఎక్కువగా ఉండే దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇదిలా ఉంటే గీత కార్మికులకు అదనంగా 10 శాతం దుకాణాల కేటాయింపు నేపథ్యంలో ఆ సామాజికవర్గానికి చెందిన కొందరు వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రస్తుతం 111 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. అద్దంకి, చీరాల, పర్చూరు, బాపట్ల, వేమూరు, రేపల్లె, నగరం సర్కిళ్లు ఉన్నాయి. అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానున్నది. మద్యం దుకాణాల లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో కొత్త వారితో పాటు, గతంలో మద్యం దుకాణాలు నిర్వహించినవారు తెరపైకి వస్తున్నారు. మద్యం వ్యాపారులు రాజకీయ పార్టీల పరంగా ఏవైపు ఉన్నా, వ్యాపార పరంగా అంతర్లీనంగా సిండికేట్‌గా తమ దందాను సాగించేందుకు ఇష్టపడుతుంటారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల లైసెన్స్ పొందేందుకు సింగి ల్‌గా వెళదామా, సిండికేట్‌గా వెళదా మా అనే కోణంలో మంతనాలు జరు పుతున్నారు. ఈ క్రమంలో కొందరు అధి కార పరంగా అన్ని మేం చూసుకుంటాం, పెట్టుబడులు మీరు పెట్టండి సిండికేట్‌గా ముందుకు సాగితేనే అందరికీ ప్రయోజనం అనే కోణంలో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. జిల్లా పరిధిలో ఒక్కో దుకాణానికి 10 మంది దరఖాస్తులు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధిక విక్రయాలు జరిగే దుకాణాలపై దరఖాస్తుదారులతో పాటు కొన్ని చోట్ల రాజకీయ నాయకులు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అయినా ఆయా దుకాణాలకు 10 కన్నా అదనంగా దరఖాస్తులు చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కొందరు నేతలు, వ్యాపారులు మంతనాలు చేస్తున్నట్లు సమాచారం.

తొలుత నోటిఫికేషన్ విడుదల

జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు 111 నడుస్తున్నాయి. నూతన మద్యం విధానం ప్రకారం కొత్త దుకాణాలకు రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలవుతుంది. ముందుగా 111 మద్యం దుకాణాలకే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుంది. గీత కార్మికులకు సంబంధించి 10 శాతం కేటాయింపు ఉండొచ్చు.

- అరుణకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, బాపట్ల



గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 20: వైసీపీ శ్రేణులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. అద్దంకి మండలంలోని ధర్మవరంలో ఈ నెల 13వ తేదీ టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా వైసీపీ శ్రేణులు విద్యుత్ సరఫరా నిలిపి వేసి రాళ్లు, కర్రలతో దాడిచేయడంతో 12 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యేగేశ్వరరావు, సుబ్బారావు, దేవదాసు, శ్రీను, లక్ష్మీనారాయణలను శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు పథకం ప్రకారం మాటువేసి మూకుమ్మడిగా దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. వైసీపీ శ్రేణుల దాడిలో ఒక టీడీపీ కార్యకర్త కన్ను పోగొట్టుకున్నారన్నారు. గతంలో నియోజకవర్గంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామాలల్లో అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలు పూర్తి సంయమనం పాటించాలన్నారు. ధర్మవరంలో వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు, బాధితులకు పూర్తిగా అండగా ఉంటానన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు కరి పరమేష్, చాగంటి రాజేంద్ర తదితరులు ఉన్నారు.



పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటకృష్ణ

వరిలో జింకు లోపం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: వరిలో జింక్ లోపం ఉన్నప్పుడు ఆకులు తుప్పు రంగులో మారతాయిని దీంతో మొక్క ఎదుగుదల ఆగిపోతుందని, ఎన్ని ఎరువులు వేసినా మొక్క తీసుకోలేదని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కలవకూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వరిలో జింకు లోపాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఏవో మాట్లాడుతూ వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించుకోవాలన్నారు. జింక్ లోపం నివారణ కోసం చిలేటెడ్ జింక్ 100 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్ రావు, రైతులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కష్టజీవుల గొంతుక ఏచూరి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

చీరాలటౌన్, సెప్టెంబర్ 20 : కష్టజీవుల శ్రమలను గుర్తెరిగి సమస్యల పోరాటానికై గొంతుక వినిపించిన మహనీయుడు సీతారాం ఏచూరి అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు విజయభాస్కర్ అధ్యక్షతన ఏచూరి సంతాప సభ జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు ముందుగా ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశనుంచే రాజకీయ రంగప్రవేశం చేసి సేవలు అందించినట్లు వివరించారు. ఎస్ఎఫ్ఐ నేతగా పరిచయమై రైతులు, కార్మిక, కష్టజీవుల కోసం అలుపెరగని పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి మరణం సామాన్యులకు తీరని లోటని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, ఎన్ బాబురావు, నారపరెడ్డి, కుర్రా రామారావు, ఏడుకొండలు, మస్తాన్‌రావు, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



కొణిదెనలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్ పాఠశాల స్థల దాత రాధాకృష్ణమూర్తి

క్రీడలతో మానసికోల్లాసం

బల్లికురవ. సెప్టెంబరు 20 : రోజూ ఆటలు ఆడటం వలన విద్యార్థులలో మానసిక ఉల్లాసం మెరుగు పడుతుందని ఎంఈవో రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొణిదెన యజ్ఞనారాయణ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలు పోటీలు జరిగాయి. ఈపోటీల్లో ఎనిమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఎంఈవో రమేష్, పాఠశాల స్థల దాత కొణిదెన రాధా కృష్ణమూర్తిలు ప్రారంభించారు. విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేబీ వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్, దేవిరెడ్డి సాయికుమారి, పోటీల కోఆర్డినేటర్ బొప్పూడి శ్రీనివాసులు, వ్యాయమ ఉపాధ్యాయులు నాగార్జున, అరుణ, విజయలక్ష్మి, మురళి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో రాష్ట్రానికి మంచిరోజులు

భారీగా నిధులతో పంచాయతీలకు మహర్దశ

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని ప్రజలు భావిస్తున్నారని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు.మండలంలోని జొన్నతాళి గ్రామ సచివాలయం వద్దశుక్రవారం జరిగిన ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో ఏలూరి పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నితిన్ అధ్యక్షత వహించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యం చేసిన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం భారీగా నిధులతో మహర్దశ కల్పించిందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే 13,326 గ్రామ పంచాయతీలలో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి 4500 కోట్ల రూపాయల విలువైన ఉపాధిహామీ పనులకు తీర్మానం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గత వైసీపీ పాలనలో కక్ష పూరిత రాజకీయాలు కొనసాగాయన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబును అకారణంగా 54 రోజులు జైలులో పెట్టినపుడే వైసీపీ ప్రభుత్వం పతనం మొదలయ్యిందన్నారు.ప్రజాసేవలో పోలీస్‌స్టేషను, కేసులకు దూరంగా ఉండే తనపై అక్రమంగా కేసులు పెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేశారన్నారు.విజయవాడలో వరదలు సంభవించిన సమయంలో ప్రజలను స్వయంగా దగ్గరుండి ఆదుకున్న చంద్రబాబు,కూటమి ప్రభుత్వ మంత్రులు చేసిన సేవా కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

తరువాత గ్రామంలో పలు సీసీ రోడ్లు, సైడు కాల్వలు నిర్మాణానికి ఏలూరి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సివిల్ సప్లయి డీఎం చంద్రశేఖర్,తహసీల్దారు ప్రశాంతి,సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ,శానంపూడి చైతన్య, శివరాత్రి శ్రీను, గుండవరపు వెంకట ప్రసాద్, తాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జొన్నతాళిలో జరిగిన ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అభివృద్ధి, సంక్షేమం ప్రజా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమం ప్రజా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండలంలోని చెరుకూరు గ్రామంలో ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేసే విధంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొసనా సత్యన్నారాయణ, ప్రజా కూటమి నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మరియమ్మపేటలో ఇంటింటి తిరుగుతూ ఇది మంచిప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య తదితరులు

పేదల కష్టాలు తీర్చే ప్రభుత్వం మనది

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 20 : పేదల కష్టాలు తీర్చే ప్రజా ప్రభుత్వం ఇదని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. కూటమి పాలన 100 రోజుల పూర్తయిన నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నియోజకవర్గంలో ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు మరియమ్మపేటలో ఎమ్మెల్యే కొండయ్య నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులను పెన్షన్లు ఎలా అందుతున్నాయని ఎమ్మెల్యే కొండయ్య అడిగారు. వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దార్శనికతతో అన్ని సమస్యలను అధిగమిస్తూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జగన్ పాలనలో అంతా అరాచకమేనని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల్లోనే సీఎం చంద్రబాబు సారథ్యంలో మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగుకు నీరివ్వాలి

రైతు సంఘం డిమాండ్

బల్లికురవ. సెప్టెంబరు 20 : ప్రభుత్వం వరి సాగుకు నీటిని విడుదల చేయాలని బాపట్ల జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో రైతు సంఘం నేతలు సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతు ఓపక్క డ్యాంలు పూర్తిగా నిండినా వరి సాగుకు నీటి విడుదల చేయకుండా ఆరు తడులు అంటున్నారని, దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉందని అన్నారు. అలానే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలను వెంటనే అందించాలన్నారు. అలానే సున్నా వడ్డీ రాయితీలను జమ చేయాలన్నారు వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి ప్రకాష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు నాగబోయిన సింగారావు, యిన్నమూరి రాజేశ్వరరావు, రామయ్య, పుచ్చకాయల వెంకట్రావు, బొట్టుగుంట కోటేశ్వరరావు, బొల్లినేని కోటేశ్వరరావు, దూళిపాళ్ల పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

రైతు సమస్యలు పరిష్కరించాలి

పంగులూరు : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పంగులూరులో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజారావుకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బాచిన హనుమంతరావు, వడ్డవల్లి కోటయ్య, రావూరి వెంకటేశ్వర్లు, శంకర్, పఠాన్ ఖాశీం, సునందబాబు, మల్లారెడ్డి, వెంకటరావు, తలపనేని సుబ్బారావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రైతులు, సంఘ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: అద్దంకిలోని కాకానిపాలెంలోని రంగనాయక స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రకాశం, పల్నాడు, బాపట్లజిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కాకానిపాలెంలోని రంగనాయక స్వామి దేవాలయంలో ప్రతి రోజు ధార్మిక ఉపన్యాసాలు, భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శుక్రవారం 100 మంది మహిళాభక్తులతో సామూహిక లక్ష్మీ కుంకుమపూజలు నిర్వహించినట్లు తెలిపారు. టీటీడీ నుంచి వచ్చిన పసుపు, కుంకుమ, లక్ష్మీ అమ్మవారి రూపులు, కంకనాలు, అక్షితలు పూజల్లో పాల్గొన్న వారికి, భక్తులకు అందించినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు భాగవతుల కొండమాచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ, గోరంట్ల కోటేశ్వరమ్మ, మురకొండ విజయమ్మ, పాములపాటి నా రాయణమ్మ, గిరిజాల వరలక్ష్మి, మాదాల దా నయ్య, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, హనుమంతరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాల పరిశీలన

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- అక్రమ తరలింపుపై పటిష్ట చర్యలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: నిబంధనలు అతిక్రమించి ఇసుకను అక్రమంగా తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. శక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన 'ఇష్టారాజ్యాంగా ఇసుక తవ్వకాలు' కథనానికి స్పందించిన ఆర్‌డీవో అద్దంకి గుండ్లకమ్మ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఇసు క జల్లెడ పడుతున్న వారితోను, ట్రాక్టర్ డ్రైవర్లతోనూ మాట్లాడారు. అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, నింబంధనలు పాటించకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే రాబోయే రోజులలో బ్రిడ్జి ప్రమాదం బారిన పడుతుందని అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో కాపలా ఏర్పాటు చేస్తున్నామని, అయినా రాత్రిళ్లు అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఇక్కడ పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు వాహనాలు పెట్టవద్దని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన వాహనాల లైసెన్సులను సీజ్ చేసే విధంగా రవాణాశాఖ అధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఆయన వెంట వీఆర్‌వో మందా రాంబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



గుండ్లకమ్మలో ఇసుక తొవ్వుతున్న వారితో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

పరిశుభ్రతపై అవగాహన పెంచాలి

ఇంకొల్లు,సెప్టెంబరు 20 : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు,కార్యదర్శి కోటినాగయ్య పాల్గొన్నారు. మండలంలోని ఇడుపులపాడులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు, పాఠశాల ఉపాధ్యాయసిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాలటౌన్, సెప్టెంబర్ 20 : రైలు ప్రమాదంలో గుర్తుతెలియని (40) వయసు కలిగిన వ్యక్తి మృతిచెందాడు. ఈసంఘటన వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అయితే మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవు. వివరాలు తెలిసిన వారు స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చదువుతో పాటు ఆటలూ అవసరమే

చీరాల, సెప్టెంబరు 20 : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు అవసరమేనని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. మండలంలోని జాండ్రపేట హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మండలస్థాయి ఆటల పోటీలను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతున్నారు. అనంతరం వాలీబాల్ పోటీలకు సంబంధించి తొలి సర్వీస్ చేసిన క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొమ్మనబోయిన రజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు

పర్చూరు, సెప్టెంబరు 20: 167ఏ జాతీయ రహదారికి సంబంధించి పర్చూరు రెవెన్యూ పరిధిలోని స్థానిక వైజంక్షన్ సమీపాన జరుగుతున్న పనులను రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. రహదారి నిర్మాణంలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా పనులను ఎలా చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా రైతులకు నష్టపరిహారం ఇవ్వటం లేదని వాపోయారు. పర్చూరు సబ్ రిజిస్ట్రార్ వారి విలువ రూ.12లక్షల రూపాయలు ఉండగా రూ.6లక్షల ప్రకారం లెక్క కట్టి అవార్డు ఇచ్చారని రైతులు తెలిపారు. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో లేఅవుట్‌లో నష్టపోయిన బాధితులకు ఒక్కో సెంటుకు రూ.1.5లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చేవిధంగా అవార్డు ఇచ్చారన్నారు. అదే లేఅవుట్ పక్కనే ఉన్న భూములకు సెంటుకు రూ.18,000 మాత్రమే అవార్డు ఇచ్చారన్నారు. పూర్తి స్థాయిలో భూములను కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తిమ్మరాజుపాలెం, బోడవాడ, పర్చూరు, నాగులపాలెం రైతులు, ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తి దారుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ కుక్కపల్లి బుచ్చిబాబు, మాజీ జడ్పీటీసీ కొల్లా సుభాష్ బాబు, మల్లాది హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.



పర్చూరులో హైవే పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్న రైతులు

జాబ్ మేళాలో 24 మంది ఉద్యోగాలకు ఎంపిక

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: పెద్ద ఉద్యోగం అయినా చిన్న ఉద్యోగం తోనే ప్రారంభం అవుతుందని, ఉద్యోగం దూర ప్రాంతంలో వచ్చినా దానిని సద్వినియోగపర్చుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె సాహిల్‌బాబు అన్నారు. శుక్రవారం అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు కల్లం టెక్స్‌టైల్స్, కెవిఎల్ గ్రూప్, మాస్టర్ మైండ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 66 మంది అభ్యర్థులు హాజరు కాగా 24 మంది జాబ్‌లకు ఎంపిక అయ్యారు. మరో 15 మంది షార్ట్ లిస్ట్‌లో ఉన్నట్లు ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రిన్సిపాల్ చేతులమీదుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, కళాశాల స్పోక్ పర్సన్ జి. రాజ్‌కుమార్, రవికిరణ్, కోఆర్డినేటర్ గోపి, శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన వారికి నియమక పత్రాలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు, తదితరులు

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 20 : విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. రామన్నపేట బాలికల హాస్టల్లో శుక్రవారం విద్యార్థినులకు ఎస్సై వెంకటేశ్వర్లు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులు తమతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఆ వెంటనే పోలీస్ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థినులు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వెంకయ్య మృతి టీడీపీకి తీరని లోటు

చినగంజాం,సెప్టెంబరు 20 : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి పాత గొల్లపాలెంకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకయ్య(68) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంకయ్య స్వగృహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకయ్య మృతి చాలా బాధాకరమన్నారు.ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి,కుటుంబసభ్యులకు తీరని లోటన్నారు. వెంకయ్య కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మండల పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వెంకయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఏలూరి

కాపు టీచర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవరావు

పర్చూరు, సెప్టెంబరు 20: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పర్చూరు మండలం ఇనగల్లు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హరిదాసుల మాధవరావు నియమితులయ్యారు. విశాఖపట్నంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని శుక్రవారం మాధవరావు తెలిపారు.ఈ సందర్భంగా మాధవరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అయిన ప్రజా కూటమి ప్రభుత్వం ఉద్యోగుల అభ్యున్నతికి తోడ్పాటు నందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చేపల చెరువులకు వేలం

మార్టూరు, సెప్టెంబరు 20: మండలంలోని నాగరాజుపల్లిగ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ పరిధిలోని మైనరు ఇరిగేషనుకు చెందిన రెండు చేపల చెరువుల వేలంను నిర్వహించినట్లు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. వాటిలో ఎర్రచెరువును గ్రామానికి చెందిన మిన్నెకంటి పోతురాజు 4.80 లక్షలకు పాటపాడారు.ఈ పాట రెండేళ్ల కాలపరిమితి వరకు ఉంటుంది.అదేవిధంగా రాజుపాలెం ట్యాంకు ఉన్న చెరువును గ్రామానికి చెందిన మిన్నెకంటి సాంబశివరావు 2.10 లక్షలకు పాడుకున్నారు.ఈ పాట కాలపరిమితి ఏడాది వరకు ఉంటుంది.

దోపిడీకి పాల్పడిన నలుగురు అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 20 : దారికాచి బంగారు నగలు దోపిడీకు పాల్పడిన నలుగురు నిందితులను ఈపూరుపాలెం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన వంగల వెంకట శాస్త్రి ఈనెల 10వ తేదీన ఈపూరుపాలెంలోని బంధువుల వద్దకు కుటుంబ సమేతంగా వచ్చాడు. ఇది గ్రహించిన నలుగురు వ్యక్తులు వెంబడించి నగలు ఉన్న బ్యాగును అపహరించారు. దీంతో బాధితులు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి శుక్రవారం వారిని అరెస్ట్ చేశారు. అలాగే అపహరణ జరిగిన 38 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. శనివారం వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

రోజువారీ కార్మికుల కాంట్రాక్ట్‌ను పొడిగించాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: అద్దంకి మున్సిపాలిటి పరిధిలో పని చేస్తున్న రోజువారి కార్మికుల కాంట్రాక్ట్ గడవు ఈ నెలాఖరుతో ముగుస్తుందని, దానిని మరో సంవత్సరం పాటు పొడింగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజువారి కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గాలి బీష్మా, పి. ఆదాం, ఇంజనీర్ వర్కర్స్ సామేలు, జాను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


సాంబయ్య (ఫైల్)

ఇంకొల్లు, సెప్టెంబరు 20 : శనగలు అమ్మేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఇంకొల్లులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వలేటి సాంబయ్య(72) గురువారం సాయంత్రం ఇంకొల్లులోని కొణికి రోడ్డులో ఉన్న శీతలగిడ్డంగిలో ఆయన నిల్వ ఉంచిన శనగలు అమ్మేందుకు వెళ్లాడు. అక్కడ నుంచి తమ స్నేహితుడి మోటర్‌సైకిల్‌పై తిరిగి ఇంకొల్లు వస్తుండగా పాతమద్రాసు రోడ్డులో డాల్ఫిన్ రెస్టారెంట్ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో గేదెలకు ఢీ కొన్నారు.దీంతో మోటర్‌సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో వెనుక కూర్చొని కిందపడిన సాంబయ్య మీదు నుంచి గేదెలు తొక్కుకుంటూ వెళ్లాయి. దీంతో ఆయనకు బలమైన గాయాలు కావడంతో ప్రయివేటు అంబులెన్స్‌లో ఒంగోలు ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున సాంబయ్య మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. మోటర్‌సైకిల్ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో గంగవరంలో విషాదచాయలు అలముకున్నాయి. ఆయన మృతదేహాన్ని మండలంలోని పలువురు ప్రముఖులు సందర్శించి సంతాపం తెలిపారు. రైతుకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

చీరాల ఎస్టీవో కార్యాలయ ప్రక్షాళన

నూతన ఎస్టీవోగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 20 : చీరాల ఉపఖజానా కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు అందిన నివేదిక ఆధారంగా ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, డీటీవో శివకామేశ్వరిలు అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్ ఎన్. మోహనరావుకు కార్యాలయ అధికారులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకట మురళి సిఫార్సు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం బాపట్ల డీటీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎంవీ సుబ్బారావును చీరాల ఎస్టీవో(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్టీవోగా పనిచేసిన భాగ్యలక్ష్మిని , సీనియర్ అకౌంటెంట్ సుధీరాలను సస్పెండ్ చేశారు. కార్యాలయంలో మిగిలిన ఆరుగురిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సంబంధీకులకు డీటీవో శివకామేశ్వరి అందజేశారు. నూతన డీటీవో సుబ్బారావుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. మధ్యాహ్నం వరకు డీటీవో చీరాల కార్యాలయంలో ఉండి పర్యవేక్షించారు. అనంతరం ఎస్టీవో భాగ్యలక్ష్మి నుంచి నూతన ఎస్టీవో సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరిని సస్పెండ్ చేయగా మిగిలిన ఆరుగురిలో గిద్దలూరుకు ఒకరు, నెల్లూరుకు ఇద్దరు, ఒంగోలుకు ఒకరు, దర్శికి ఒకరు, కనిగిరికి ఒకరు బదిలీ కాగా వారికి ఎస్టీవో సుబ్బారావు రిలీవింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. వారి స్థానంలో కొత్తగా నియమితులైన వారిలో ముగ్గురు విధుల్లో చేరారు. కనిగిరి నుంచి ఇద్దరు, మార్కాపురం నుంచి ఒకరు, దర్శి నుంచి ఒకరు కొత్తవారు విధుల్లో చేరాల్సి ఉంది. వీరు శనివారం జాయినింగ్ ఆర్డర్లతో విధుల్లో చేరే అవకాశం ఉందని ఎస్టీవో సుబ్బారావు తెలిపారు. మొత్తం మీద ఎస్టీవో కార్యాలయం ప్రక్షాళనపై ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలపై ఇతర శాఖల్లోనూ చర్చ జరుగుతోంది.

250 కుటుంబాలకు దుస్తుల పంపిణీ

మేదరమెట్ల, సెప్టెంబరు 20 : ఇటీవల విజయవాడలో వరదలతో ఇబ్బంది పడిన ప్రజలకు కొరిశపాడు, జె. పంగులూరు మండలాల ఆర్యవైశ్య నాయకులు దుస్తులు పంపణీ చేశారు. శుక్రవారం విజయవాడలోని హెచ్‌బీ కాలనీలోని వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, లుంగీలు, చీరలు, ఊరగాయ పచ్చళ్లను పంపిణీ చేసినట్లు బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మద్దాళి సంజీవరావు తెలిపారు. వరద బాధితులకు తమవంతుగా సాయం చేయాలనే ఆలోచనతో వారికి ఉపయోగపడే విధంగా దుప్పట్లు చీరలు, లుంగీలు తినడానికి ఊరగాయ పచ్చళ్లను అందజేసినట్లు సంజీవరావు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది సుబ్రహ్మణ్యం, సాతులూరి భావన్నారాయణ, సంయుక్త కార్యదర్శి బైసాని కోదండ రామప్రసాద్, కొరిశపాడు మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు దేసు పుల్లారావు, జె. పంగులూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కే. శివశేషరావు, కార్యదర్శి సోము నాగేశ్వరావు, సామా సురేష్, బేరకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచి నడవడికతో చదివి పేరు తేవాలి


మైక్‌సెట్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి నడవడికతో బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సంవత్సరం పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తామని ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం ఊటుకూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, నందిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వందరోజులలో పలు అభివృద్ధి పనులు

ఎంపీడీవో రామాంజనేయులు


వంద రోజులలో చేపట్టిన పనులను వివరిస్తున్న అధికారులు,సిబ్బంది

పంగులూరు, సెప్టెంబరు 20 :వంద రోజుల పాలనలో నూతన ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మంచి ప్రభుత్వంగా ప్రజా మన్ననలు పొందిందని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. మండలంలోని జనకవరం గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. పింఛన్ పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ ద్వారా టీచర్ల నియామక ప్రక్రియ, అన్న క్యాంటీన్ల ప్రారంభంతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్లను అందచేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్డీ రామ్‌కుమార్, ఎంఈవో వీరాంజనేయులు, రాంబాబు, కార్యదర్శి సుకన్య, సుబ్బారావు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షునిగా కరణం వెంకటేష్ ...?

చీరాల, సెప్టెంబరు 20 : వైసీపీ జిల్లా అధ్యక్షునిగా ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను నియమించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహనరెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం తాడేపల్లిలోని కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని బాధ్యులతో జగన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్‌ను బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షునిగా పనిచేయాలని అడిగినట్లు సమాచారం. అయితే వెంకటేష్ అప్పటికప్పుడు ఏ నిర్ణయం తెలపనట్లు తెలిసింది. తరువాత ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో సజ్జల రామకృష్ణారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. సమావేశానికి జిల్లాలోని అద్దంకి, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాణెం హనిమిరెడ్డి, గణేష్, మేరుగ నాగార్జునలు హాజరయ్యారు. పర్చూరు, బాపట్ల నియోజకవర్గాల ఇన్‌చార్జులు యడం బాలాజీ, కోన రఘుపతిలు అమెరికాలో ఉండటంతో వారు హాజరుకాలేదని తెలిసింది.

జనంతో మమేకం


బజారులో నడుచుకుంటూ వెళ్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ అన్సారియా

దగాపడ్డ కుటుంబాలకు చేయూత
నిశిత పరిశీలన.. నిర్దిష్ట చర్యలు
ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంను
ప్రజల కోసమే వినియోగించిన చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆరు రోజులు గ్రామాలకు వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అందులోభాగంగా ఆయన తొలిరోజు కార్యక్రమాన్ని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించి ప్రభుత్వం ప్రజాసేవకే పరిమితమన్న సంకేతాన్ని ఇవ్వగలిగారు. రమారమీ రెండున్నర గంటల పాటు ఆయన ఆ గ్రామంలో గడిపారు. ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ప్రజలతో మమేకమయ్యారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు చేసే హడావుడి, ఆర్భాటాలు ఈ కార్యక్రమంలో మచ్చుకు కూడా కనిపించలేదు. గ్రామంలోని కొన్ని గృహాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవటంతో పాటు గ్రామసభలో కూడా ప్రజలను పిలిచి మాట్లాడించి వారు చెప్పే పొగడ్తలకు పొంగిపోకుండా వారు వినిపించిన సమస్యలపై సానుకూలంగా స్పందించటం అప్పటికప్పుడు కొన్ని ప్రజోపకర నిర్ణయాలు తీసుకోవటం విశేషం.

పేద కుటుంబాలకు చేయూత

మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో హెలికాప్టర్‌లో వచ్చిన చంద్రబాబు వెంటనే మద్దిరాలపాడు గ్రామంలోకి ప్రవేశించారు. గ్రామంలో నేరుగా సభలోకి వెళ్లకుండా కొందరు ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా రెండు కుటుంబాల వారు చెప్పిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రత్యేకించి ఒక కుటుంబం వారు గత ప్రభుత్వంలో దగాపడిన విషయం గుర్తించి అప్పటికప్పుడు ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన ఆర్థిక సహకారాన్ని కూడా అందించే ఏర్పాటు చేశారు. తొలుత ఆయన ముస్లింల ఇంటికి వెళ్లారు. ఇంటిలోని గృహిణి షేక్ బీబీసార తాను కూలీ పనులకు వెళ్తానని, తన భర్త బేల్దారీ పనులకు వెళ్తాడని చెప్పింది. వెంటనే చంద్రబాబు వారి పిల్లల గురించి వాకబు చేశారు. వారి కుమార్తె రజియాబేగం 10వ తరగతి వరకు చదువుకుందని, ఆర్థిక స్తోమత లేక చదువు ఆపేసి తనతో కూలీ పనులకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. వారి కుమారుడు కరిముల్లా 9వ తరగతి వరకు చదువుకున్నాడని, అతను చదువు ఆపించి మెకానిక్‌గా పనికి పంపుతున్నట్లు వివరించింది. ఆశ్చర్యపోయిన చంద్రబాబు పిల్లల్ని మీకు చదువుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించగా వారు చదువుకోవాలనే ఆసక్తి చంపుకొని కూలి పనులకు వెళ్తున్న విషయాన్ని తెల్పారు. ఎందుకు వారిని చదివించటం లేదని అడగ్గా బీబీసార గతంలో టీడీపీ ప్రభుత్వంలో 2017-18లో తమకు ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టామని మీరు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బుల్లో రెండు బిల్లులు ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో తమకు ఒక్క రూపాయి కూడా రాలేదని, ఆ ఇంటి కోసం అప్పు చేయాల్సి వచ్చిందని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబాన్ని ఈదుకుంటూ అప్పు తీర్చుకునేందుకు పిల్లలను కూలీ పనులకు పంపక తప్పలేదని వివరించారు. తర్వాత ఆమెను గ్రామసభకు పిలిపించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఇంకా వారికి రావాల్సిన రూ.65,150లను వెంటనే ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ రోజే ఆ డబ్బులకు సంబంధించిన చెక్ ఇవ్వాలని స్పష్టంగా ఆదేశించారు. అలాగే వారి పిల్లలిద్దరినీ చదివించే బాధ్యత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వెంటనే వారిని పాఠశాలలో చేర్చాలని ఆదేశించారు. వారి పాప రజియాబేగం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవాలనుకుంటే అవసరమైన ఏర్పాటు చేయాలని సభలో ఉన్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు సూచించారు. ఆ తర్వాత బీబీసార మైక్ తీసుకొని సీఎం ఇచ్చిన చేయూతకు హర్షం వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రావాల్సిన నిధులు ఆగిపోగా మళ్లీ మీరు వస్తే మా కల నెరవేరుతుందని ఆశించామన్నారు. తమ కల మరింత స్థాయిలో నిజం కావటంతో మాటలు రావటం లేదని మీకు రుణపడి ఉంటామని మళీమళ్లీ మీరే సీఎం కావాలంటూ కన్నీరు పెట్టుకుంటూ మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ చేపట్టిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగాపడ్డ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు చేయూతనిచ్చే విధంగా నిర్వహించారు. ఎలాంటి హడావుడి లేకుండా గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపారు. హంగు ఆర్భాటాలకు పోకుండా పేదల ఇళ్లకు వెళ్లటం, వారితో మాట్లాడటం చూస్తే ప్రజాపాలన అంటే ఇది కదా అని జనం చర్చించుకోవడం విశేషం. కాగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజల కోసం వినియోగించి అందని మన్ననలు బాబు పొందగలిగారు. నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడు గ్రామంలో శుక్రవారం ఆయన నిర్వహించిన ఈ కారార్యక్రమం అందుకు అద్దం పట్టింది.

వెంటనే అందరికీ ఇళ్లు మంజూరు

బీబీసార ఇంటి తర్వాత ముఖ్యమంత్రి కల్లుగీత కార్మికుడు ఆలుదాసు శ్రీను ఇంటికి వెళ్లారు. నిరుపేద అయిన తమకు అన్నీ అర్హతలు ఉన్నా గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేయలేదని చెప్పారు. అందరి చుట్టూ తిరిగినా పని జరగలేదని వివరించారు. పైగా తాము వాళ్ల పార్టీ కాదనే నెపం పెట్టి పక్కన పెట్టారని చెప్పారు. వాళ్లకు వెంటనే ఇంటిని మంజూరుచేయటంతోపాటు కొత్త మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేసే మద్యం దుకాణంలో ఒకటి వారికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇళ్లులేని వారు సుమారు 200 కుటుంబాలు ఉన్నాయనే అధికారుల నివేదిక పరిశీలించి అందరికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

వెంటనే ట్రై సైకిల్ ఇవ్వండి

గ్రామసభలో ఎదురుగా ప్రజల్లో ఉన్న ఒక దివ్యాంగుడిని చూసి అతడి సమస్యలు అగిగారు. ఆయన ట్రై సైకిల్ కూడా లేని విషయాన్ని చెప్పగానే వెంటనే ట్రైసైకిల్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు దివ్యాంగుడినైనప్పటికీ పింఛన్ రాని విషయంను సీఎం దృష్టికి తీసుకెళ్లగా నిబంధలకు అనుగుణంగా వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఆ సందర్భంగా ఆయన ప్రభుత్వ డాక్టర్లను హెచ్చరిస్తూ గతంలో తప్పుడు సదరమ్ సర్టిఫికెట్లు ఇచ్చిన విషయం బయటకు వచ్చిందని, భవిష్యత్తులో అలాంటి పనులు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్పంచ్ ఆవేదన.. బాబు స్పందన

గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ స్వర్ణ అనురాధ మాట్లాడుతూ తాను ఎంసీఏ చదువుకున్నానని, గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో అనేక ప్రయత్నాలు చేశానన్నారు. విద్యుత్ సమస్యపై , తాగునీటి సమస్యపై సంబంధిత అధికారుల చుట్టూ తిరిగానని వివరించారు. ఎవ్వరూ సానుకూలంగా స్పందించకపోగా తాను తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్‌నంటూ తన ప్రతిపాదనలు తోసిపుచ్చారని భావోద్వేగంతో వివరించారు. ఈ ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే తాను పదవిలో ఉండి వ్యర్థం అన్నట్లు మాట్లాడారు. దీనిపై స్పందించిన సీఎం మీరు నిరాశ పడకండి మన ప్రభుత్వం అంతా మంచే చేస్తుంది. ఇది మంచి ప్రభుత్వం అంటూ అనేక గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. సర్పంచ్ అనురాధ మరింత ఉత్సాహంగా పనిచేసే విధంగా ప్రోత్సహించి సభికుల మన్ననలు అందుకున్నారు.

హంగూ ఆర్భాటం లేకుండా..

గ్రామంలో హంగూ ఆర్భాటాలు లేకుండా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటనలో సందర్భంగా గాని గ్రామసభ సందర్భంగా గాని పోలీసుల అడ్డంకులు, నాయకులు, ప్రజాప్రతినిధుల ఆర్భాటాలు కనిపించలేదు. అధికారులు ఎంపిక చేసిన వారి ప్రసంగాలకే పరిమితం కాకుండా సభలోని కొందరిని పిలిచి మాట్లాడించి మా ప్రభుత్వం మీకోసం ఉంది. నిర్భయంగా ముందుకు వచ్చి పనులు చేయించుకోండి అంటూ కార్యక్రమాన్ని నిర్వహించి యావత్తు గ్రామ ప్రజల మన్ననలు పొందగలిగారు.

ముఖ్యమంత్రి పర్యటన మూడు గంటలు

స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు
ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 20: మద్దిరాలపాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు గంటల పాటు పాల్గొన్నారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో సాయివిష్ణు విల్లాస్ చతుర్వాటికలో హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డి.బాలవీరాంజనేయస్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బీఎన్.విజయకుమార్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆశోక్‌రెడ్డి, ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు దామచర్ల సత్య, గరటయ్య, నూకసాని బాలాజీ, కలెక్టర్ తమీమ్ అన్సారీ, గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ ఆర్.దామోదర్ తదితర నాయకులు ఘన స్వాగతం పలికారు. 2.32 నిమిషాలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగి సభాస్థలికి ప్రత్యేక బస్సులో బయలుదేరారు. ఆయన వెంట ప్రధాన కార్యాదర్శి నీరబ్‌కుమార్ ఉన్నారు. గ్రామంలో మూడు కుటుంబాల వారితో ముఖాముఖి మాట్లాడి ప్రభుత్వ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మద్దిరాలపాడులో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించి తిరిగి హెలిప్యాడ్ వద్దకు 5.30కు వచ్చి మంగళగిరి తిరిగి వెళ్లారు. మూడు గంటల పాటు మద్దిరాలపాడులో ప్రజలతో మాట్లాడటంతో పాటు సభలో ప్రజల ప్రభుత్వ పని విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.


చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేచిచూస్తున్న నేతలు

పంచాయతీలు బలంగా ఉంటేనే అభివృద్ధి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
మిన్నేకల్లులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

సంతమాగులూరు, సెప్టెంబరు 20: పంచాయతీలు బలంగా ఉంటేనే అభివృద్ధి చెందుతాయని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగాయి. సంతమాగులూరు మండలం మిన్నేకల్లు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె. వెంకట మురళి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రాల ద్వారా కొందరు తమ సమస్యలను విన్నవించగా, మరి కొందరు స్వయంగా విన్నవించడంతో తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తోందని తెలిపారు. వందరోజుల పాలన దిగ్విజయంగా ముగించుకుని అభివృద్ధివైపు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని, ప్రజలకు ఉపయోగపడే పనులను మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ప్రజలలోకి వెళ్లాలి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాలు వారం రోజులు పాటు జరుగుతాయన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్ సొమ్ము మూడు నుంచి రూ.నాలుగు వేలకు పెంచడం, దివ్యాంగులకైతే రెండింతలు చేసి రూ.6,000లు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. భూములకు భద్రతలేక, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. వంద రోజుల్లోనే 16,437 డీఎస్సీ పోస్టుల విడుదల చేశాం, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు. కేవలం ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ల ద్వారా టిఫిను, భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, ప్రజలకు ఉపయోగపడే పనులనే ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని చెప్పారు. వరద విపత్తు సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి 10 రోజులు బస్సులోనే ఉండి ప్రజలకు సహాయక చర్యలు అందేలా చూశారన్నారు. మిన్నేకల్లు గ్రామానికి రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రహదారులు, మురికి కాల్వలు నిర్మిస్తామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని, రాజీ పడరాదని సూచించారు. కలెక్టర్ జె వెంకటమురళి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నదన్నారు. బాపట్ల జిల్లాలో 30 వేల మంది నిరాశ్రయులైతే సహాయక చర్యలు అందించడంలో వెనుకాడలేదన్నారు. ఎలాంటి ప్రాణహాని లేకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా 24 గ్రామాలకు తక్షణమే విద్యుత్ ఇచ్చామన్నారు. ఐదు గంటల్లోనే తాత్కాలిక రహదారులను పునరుద్ధరించామన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పరిపాలనలో నిమగ్నమయిందని చెప్పారు. అద్దంకి నియోజకవర్గ ప్రజల కోసం ప్రతి సోమవారం ఒక మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, ఎంపీపీ యలమంద, సర్పంచ్ ఎం. గోవిందమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాగడానికి ఇబ్బందికరంగా గుండ్లకమ్మ జలాలు


రంగుమారి వస్తున్న గుండ్లకమ్మ జలాలు

మేదరమెట్ల, సెప్టెంబరు 20: మేదరమెట్లలలోని తాగునీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు వాడుకోవడానికి కూడా అవకాశం లేనంతగా రంగుమారి వస్తున్నాయి. ఇటీవల ఈ పథకం ద్వారా వస్తున్న నీటిపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గేట్లు కొట్టుకుపోవడంతో రిజర్వాయర్‌లో నీరు పూర్తిగా అడుగంటింది. తాగునీటి పథకాలకు కూడా నీరు అందకపోవడంతో కొద్ది రోజులు నీటి సరఫరాను కూడా నిలిపి వేశారు. ఇటీవల కురిసిన వర్షాల వలన రిజర్వాయర్‌లోకి నీరువచ్చి చేరింది. మేదరమెట్లలోని తాగునీటి పథకం వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, క్లోరినేషన్ చేయకపోవడం వలన గుండ్లకమ్మ నీటిపై పలు గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ తాగునీటి పథకం కింద 20గ్రామాలకు పైగా నీటి సరఫరా జరుగుతోంది. అసలే దగ్గు , జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాగునీరు ఈ విధంగా రావడంతో ఇంకేమి వ్యాధులు వస్తాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీటిని పూర్తిగా వడకట్టడం, క్లోరినేషన్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమలకు సకాలంలో రుణాలు అందిస్తాం

బ్యాంకు ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్


మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి

బల్లికురవ, సెప్టెంబరు 20 : అన్ని పరిశ్రమలకు సకాలంలో రుణాలు అందించి కార్మికులకు ఉపాధి మెరుగు పడేలా తమ వంతు చేయూత అందిస్తామని గుంటూరు బ్యాంకు అఫ్ బరోడా రీజినల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామం వద్ద గల గ్రానైట్ ఫ్యాక్టరీలో గ్రానైట్ యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య అధ్యక్షతన బ్యాంకు అఫ్ బరోడా ఆధ్వర్యంలో పరిశ్రమల యజమానులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతు పరిశ్రమలను ఏర్పాటు చేసిన, కొత్తగా నిర్మాణంలో ఉన్న యజమానులు తమ బ్యాంకును సంప్రదించాలని, వారికి రుణాలపై ప్రత్యేక రాయితీలు ఇస్తామని అన్నారు. అనంతరం యజమానులు ఆర్ఎంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ క్రెడిట్ హెడ్ ప్రదీప్, ఒంగోలు చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం,కిషోర్, స్థానిక మేనేజర్ ధన్‌పాల్, పలు గ్రామాలకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్‌కు న్యాయవాదులు విరాళం

- రూ.30వేల చెక్కును ఎమ్మెల్యే కొండయ్యకు అందజేత



ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కు అందజేస్తున్న న్యాయవాదులు

చీరాల, సెప్టెంబరు 20 : గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కొండయ్య మరో 11 మందిపై వైసీపీ ప్రభుత్వ హయాంలో కేసు నమోదయ్యింది. ఆ కేసుకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య తదితరులు కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు న్యాయవాదులు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.30వేలు చెక్కును ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటివారిని ఆదుకునేందుకు న్యాయవాదులు ముందుకు రావటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా హరివర్మ

● యథాస్థానానికి కుమారి బదిలీ

నెల్లూరు(హరనాథపురం) : మార్కెట్ వ్యాల్యూ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ అయిన సీఆర్ హరివర్మను తిరిగి నెల్లూరు జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తూ నెల్లూరుకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న ఆడిట్ రిజిస్ట్రార్ కుమారిని యథాస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరువు కోసం కుమార్తెనే కడతేర్చారు!

గ్రామస్థుల సమాచారంతో వెలుగులోకి.. ● పోలీసులు అదుపులో నిందితులు



శ్రావణి (ఫైల్)

కొడవలూరు, సెప్టెంబరు 20 : పరువు కోసం పాకులాడిన తల్లిదండ్రులు కన్నపేగునే కడతేర్చారు. కొడవలూరు మండలంలో 25 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన స్థానికుల సమాచారంతో శుక్రవారం వెలుగుచూసింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తల్లిదండ్రులను విచారించగా, విస్తు పోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చారు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. కొడవలూరు మండలం సత్రం గ్రామానికి చెందిన సన్నకారు రైతు తిరుమూరు వెంకట రమణయ్య, దేవసేనమ్మలకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యం కారణంగా పదిహేనేళ్ల క్రితం పెద్దకుమారుడు మృతి చెందగా, మిగిలిన ముగ్గురినీ అల్లారు ముద్దుగా పెంచి, ప్రయోజకు లను చేశారు. వీరిలో మూడవ సంతానం తిరుమూరు శ్రావణిని (24) ఐదేళ్ల క్రితం సంగం మండలం సిద్ధీపురానికి చెందిన రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే, పెళ్లి అయిన ఏడాదికే కుటుంబంలో కలహాలు రావడంతో భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం అల్లూరు మండలం ఆములూరు గ్రామంలో మరో మతానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. పరువుకు ప్రాధాన్యత ఇచ్చే శ్రావణి తల్లిదండ్రులు కుమార్తె చేసుకున్న వివాహంపై లోలోన రగిలిపోతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం తన కుమార్తెను అపహరించాడంటూ భర్తపై అల్లూరు పోలీసులకు శ్రావణి తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత కుమార్తెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. అయితే, ఇంటికి వచ్చినా తాను భర్తతోనే కలిసి ఉంటానని, తనను పంపేయాలంటూ కుటుంబ సభ్యులతో శ్రావణి గొడవ పడేది. ఈ నేపథ్యంలో 25 రోజుల క్రితం జరిగిన ఘర్షణలో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు కుమార్తె గొంతు నులిమి హత్య చేసినట్టు సమాచారం. ఆ తర్వాత మృతదేహాన్ని తమ ఇంటి వెనుక గడ్డివామి వద్ద పూడ్చిపెట్టారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి బయటకు పొక్కడంతో గ్రామానికి చెందిన కొంతమంది గురువారం 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అదే రోజు రాత్రి వెంకట రమణయ్య ఇంటికి వెళ్లిన పోలీసులు శ్రావణి ఏమైందంటూ నిలదీశారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి తమ సిబ్బందితో తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక పూడ్చిపెట్టిన శ్రావణి మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మృతురాలి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఇదివరకే కొంత సమాచారం ఇచ్చారని, ఇంకా పూర్తిస్థాయిలో నిందితులను విచారించాల్సి ఉందని తెలిపారు. కొడవలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌లో 800.. మున్సిపాలిటీల్లో 600

ఒక్కో షాపు పరిధిలో రేషన్‌కార్డుల సంఖ్య ఇది

గ్రామాల్లో 500 కార్డులు ఉండేలా కసరత్తు

ఆ తర్వాత కొత్త షాపుల ప్రకటన

డీలర్ల నియామకానికి నవంబరు 8న ఇంటర్వ్యూలు



నెల్లూరు (హరనాథపురం) : రేషన్ షాపుల హేతుబద్ధీకరణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామాలలో ఒక్కో షాపు పరిధిలో ఎన్ని కార్డులు ఉండాలనే అంశమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆ శాఖ కమిషనర్ నుంచి విధి విధానాలు అందాయి. ఈ ప్రకారం షాపులకు కార్డులు కేటాయించి హేతుబద్ధీకరణ పూర్తి చేస్తారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా కార్డులు, రేషన్ షాపుల వివరాలను అధికారులు సేకరించారు. ఈ నెలాఖరులోగా రేషనలైజేషన్‌కు అర్హత ఉన్న డిపోల వివరాలు, ఖాళీల సంఖ్యను గుర్తిస్తారు. అక్టోబరు 3వ తేదీన రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అక్టోబరు 4న కొత్తగా ఎన్ని రేషన్ షాపులు అవసరమో గుర్తిస్తారు. దీని ఆధారంగా అక్టోబరు 24న ఖాళీల సంఖ్యతోపాటు కొత్త డిపోలను ప్రకటిస్తారు. ఆ తరువాత దరఖాస్తులను ఆహ్వానించి నవంబరు 7వ తేదీన రాత పరీక్ష, 8న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను నవంబరు 15న ప్రకటించి 16న నియామక పత్రాలు అందచేస్తారు. ఎంపికైన డీలర్లకు 23న ఈపాస్ మిషన్లు అందచేస్తారు.

● 1,513 రేషన్ షాపులు

జిల్లాలో 1,513 రేషన్ షాపులు ఉండగా, వీటిలో 238 షాపులకు డీలర్లు లేరు. ఆ ఖాళీలలో ప్రస్తుతం పక్కనే ఉన్న డీలర్లను, పొదుపు సంఘాల సభ్యులను నియమించి సరుకులు పంపిణీ చేయిస్తున్నారు. ఎండీయూ వాహనాలు ఉన్నా, డీలర్లు షాపునకు వెళ్లి లబ్ధిదారులకు సరుకులు అందచేస్తూనే ఉన్నారు. హేతుబద్ధీకరణ విధివిధానాల ప్రకారం కార్పొరేషన్ పరిధిలోని ఒక్కో షాపునకు 800 కార్డులు, మున్సిపాలిటీల పరిధిలోని షాపునకు 600, గ్రామ ప్రాంతాల్లోని షాపునకు 500 కార్డులు ఉండేలా సమరిస్తారు. మండలాల వారీగా 500 కార్డులకు పైబడి వున్న షాపులను అధికారులు గుర్తించారు. వీటిలో నెల్లూరులో అత్యధికంగా 145 షాపులు ఉండగా, కావలిలో 55, బుచ్చిలో 22, ఆత్మకూరులో 19, కందుకూరులో 29, కోవూరులో 21, వెంకటాచలంలో 20 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 500 కార్డులకు పైబడి 590 షాపులు ఉన్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు గుర్తించారు. ఈ అంశానికి సంబంధించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీవీ. రమణ మాట్లాడుతూ జిల్లాలో కార్డుల ప్రాతిపదికగా రేషన్ షాపుల హేతుబద్ధీకరణ పూర్తి చేస్తామని చెప్పారు. ఆ తరువాతనే కొత్త డిపోల ఏర్పాటు ఉంటుందని స్పష్టం చేశారు.

'విజయ'లో ఎన్నికల నగారా

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితిలో (విజయ డెయిరీ) ఎన్నికల నగారా మోగింది. సహకార శాఖ ఎన్నికల అధికారి బీ.హరిబాబు శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 15 మంది బోర్డు సభ్యులు కలిగిన పాలక మండలిలో రోటేషన్ పద్ధతిలో ముగ్గురు సభ్యులకు ఈ నెల 30న పదవీ కాలం ముగియనుంది. వీరిలో అన్నంరెడ్డి వరదారెడ్డి (మనుబోలు మండలం మడమనూరు), ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డి (కొడవలూరు మండలం యల్లాయపాళెం), పెద్దిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (దుత్తలూరు మండలం సోమలరేగడ)లు ఉన్నారు. దీంతో ఈ మూడు బోర్డుసభ్యుల పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 23న నామినేషన్ల స్వీకరణ, 24న ఉపసంహరణ ఉంటుంది. పోటీ ఉన్నట్లయితే 28న ఎన్నికలు జరుగుతాయి. అదేరోజు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు హరిబాబు, శివయ్య తెలిపారు.

● టీడీపీ నేతల వ్యూహం

వైసీపీ హయాంలో ఆ పార్టీ మద్దతుదారులే డైరెక్టర్లుగా కొనసాగారు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా డెయిరీలో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఖాళీ అవుతున్న డైరెక్టర్ పదవులను కైవసం చేసుకొనేందుకు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు మాజీ డైరెక్టర్లు నాయకులు ఈ పదవుల కోసం అన్ని ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.



టీపీగూడూరు : మహిళలకు కరపత్రాలు అందజేసి నమస్కరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఊరూరా 'ఇది మంచి ప్రభుత్వం'

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇప్పటిదాకా సాగిన పాలనను వివరిస్తూ అధికారులు, నాయకులు ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజున ఊరూరా ఎమ్మెల్యేలు, అధికారులు ప్రతి ఇంటి గడపకు చేరుకుని కరపత్రాలు అందజేశారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 24 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

23లోగా ఈకేవైసీ చేసుకోవాలి

● 30న ఆర్బీకేలలో తుదిజాబితా ప్రచురణ : జేసీ

నెల్లూరు (వ్యవసాయం) : వ్యవసాయ, ఉద్యాన రైతులందరూ ఈ నెల 23వ తేదీలోగా పంటల నమోదుతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట, ఈకేవైసీల నమోదు ప్రక్రియపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. జిల్లాలో ఈ-పంట నమోదు నూరు శాతం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈకేవైసీకి చేసేందుకు అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ఈ రెండు ఎంతో ముఖ్యమని వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ వరకు గ్రామాల్లో ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శనతోపాటు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. 25 నుంచి 28వరకు సోషల్ ఆడిట్ గ్రీవెన్స్ అనంతరం 30వతేదీ రైతు సేవా కేంద్రాల్లో తుది జాబితా ప్రచురించాలని తెలియజేశారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసరావు, జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీకి 10 బృందాలు

నెల్లూరు(వైద్యం): జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసేందుకు 10 మంది ప్రోగ్రాం అధికారులతో బృందాలను నియమించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం ప్రకారం ఏ స్కానింగ్ సెంటర్‌నూ లింగని ర్ధారణ చేయరాదన్నారు. 10 రోజులలో ఆయా బృందాలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఒకవేళ స్కానింగ్ కేంద్రాలు తప్పు చేసినట్లు తనిఖీలో వెల్లడైతే వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు విడుదల

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 : రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖలో ఉద్యోగులు, అధికారుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ఒకే స్థానంలో రెండేళ్ల విధులు నిర్వహించిన వారిని బదిలీకి అర్హులుగా పేర్కొన్నారు. బదిలీలకు జీరో సర్వీసు వర్తింపచేయాలని ఆ శాఖకు చెందిన ఉద్యోగుల యూనియన్ తీవ్రంగా ప్రయత్నం చేసినట్లు సమాచారం. కానీ, రెండేళ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుని బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తీరని 'సర్దుబాటు' కష్టాలు

జిల్లాలో 545 మంది టీచర్లకు సర్దుబాటు

237 పోస్టుల మిగులు

విధుల్లో చేరేందుకు ఉపాధ్యాయుల విముఖత

తమ ఇబ్బందులు పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి

క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, అధ్యయనం చేపట్టకుండా చేసిన సర్దుబాటు ప్రక్రియపై నేటికీ అభ్యంతరాలు, సవరణలతోనే గడిచిపోతున్నాయి. తొలుత మండల, డివిజన్ స్థాయిల్లోనే కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులను సర్దుబాటు చేశారు. వీటిలో 40 శాతం మంది విధుల్లో చేరేందుకు విముఖత వ్యక్తం చేస్తూ విద్యాశాఖాధికారులకు వినతులు అందిస్తూనే ఉన్నారు. దీనిపై అధికారులు పునః పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 20 : ప్రభుత్వ బడుల్లో బోధన సరిగా లేదని, ఉపాధ్యాయుల కొరత ఉందని అత్యధిక శాతం మంది తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఈ సమస్యలన్నీ అధిగమించేందుకు మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పాఠశాలలను పటిష్ఠం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం టీచర్లను గుర్తించి, అదనంగా ఉన్నవారిని కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేపట్టారు. ఈ విద్యాసంవత్సరం వరకు సర్దుబాటు అయిన పాఠశాలల్లో బోధించాల్సి ఉంది. గతంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం లోనే నిర్వహించే సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఈసారి ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాల్లోనే నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 782 మంది మిగులు టీచర్లలో 545 మందిని సర్దుబాటు (358 పాఠశాలల్లో) చేయగా 237 మంది మిగిలిన సర్‌ప్లస్ టీచర్లను జిల్లాస్థాయిలో జరిగే సర్దుబాటు ప్రక్రియలో సర్దుబాటు చేస్తామని తెలిపారు. అయితే సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లా కేంద్రంలో కొందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరేందుకు పేచీ పెడుతున్నారు.



● సర్దుబాటు కష్టాలు

విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళంగా మారిందని ఉపాధ్యాయులు, సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అనేక డివిజన్లలో అనేకమంది ఉపాధ్యాయులను నాలుగు మండలాలు దాటి సర్దుబాటు చేశారని, దీనికారణంగా అందరూ ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. అనారోగ్య పరిస్థితులు, వృద్ధ తల్లిదండ్రులు కలిగిన ఉపాధ్యాయులు, చిన్నపిల్లలు ఉన్నవారు, అనారోగ్యంతో ఉన్నవారు ప్రయాణ సౌకర్యంలేని మారుమూల ప్రాంతాలకు ఎలా వెళ్లగలరని ప్రశ్నిస్తున్నారు. ఏడాది మధ్యలో పాఠశాలలను మార్పుచేసి కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. దీనిపై ఇప్పటికే డీఈవోకు విజ్ఞప్తులు అందజేశామని, వెంటనే స్పందించి అసంబద్ధ సర్దుబాట్లను సరిచేసి న్యాయం చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు.

● అంతా ఆన్‌లైన్‌లోనే..

అయితే, దీనిపై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ సర్దుబాటు అంతా రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో జరిగినట్లు చెబుతున్నారు. అందరూ ఆమోదించాకే విద్యాశాఖ నుంచి విధుల్లో చేరేందుకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. టీచర్ల వినతులను ఉన్నతాధికారులకు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

● డీఈఓకు ఏపీటీఎఫ్ నేతల వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

నెల్లూరు (విద్య) : పని సర్దుబాట ప్రక్రియలో ఎస్జీలను హైస్కూళ్లను సర్దుబాటు చేసినందున ప్రాథమిక పాఠశాలల్లో అనేక ఖాళీలు ఏర్పడ్డాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.సురేంద్ర రెడ్డి కోరారు. నగరంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ రామారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్ట్ వారీగా 300 మందితో సీనియారిటీ జాబితాలు తయారు చేసి డీఎస్‌సీ వారీగా అన్ని లిస్టులను మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అదే విధంగా సమగ్రశిక్ష, డీఈఓ కార్యాలయాల్లో అనధికారికంగా పనిచేస్తున్న వారిని పాఠశాలలకు పంపించాలని, ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా పారదర్శకంగా భర్తీ చేయాలన్నారు. పొదలకూరు మండలంలో ఎస్జీటీల సర్‌ప్లస్ జాబితాలో జరిగిన అవకతవకలను సరిచేసి ఎస్జీటీల పని సర్దుబాటును పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, నేతలు కృష్ణారెడ్డి, ఎస్‌డీ.జుల్ఫికర్ అలీ, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రికవరీ ఆదేశాలు సరే..

నగదు ఎవరు చెల్లించాలి!

- మండలంలో తొలిసారిగా రూ.97.26లక్షల రికవరీకి ఆదేశాలు
- క్షేత్ర సహాయకుడు, ఈసీ, టీఏలే ప్రధాన బాధ్యులు
- పర్సనల్ హియరింగ్ తర్వాతే కొలిక్కివచ్చే అవకాశం

కొండాపురం, సెప్టెంబరు 20: కేంద్ర ఉపాధిహామీ పథకం దోచుకున్న వారికి దోచుకున్నంత అన్న చందంగా మార్చుకున్నారు కొందరు. తామేం చేసినా చెల్లుతుందంటూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. పేదలకు దక్కాల్సిన నిధులు పక్కదోవ పడుతున్నాయి.

మండలంలో 15వేలపైగా జాబ్‌కార్డులు

19పంచాయతీల్లో 15వేలకుపైగా జాబ్‌కార్డులున్నాయి. ఒక్కొక్క జాబ్‌కార్డులో నలుగురు కుటుంబసభ్యులు ఉంటారు. వీరందరికీ కలిపి ఏడాదిలో 100రోజుల పనిదినాలు కల్పించి వారికి సగటున రూ.25వేల వరకు నగదును నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు మండలంలో 533 పనులు చేపట్టి రూ.16కోట్ల నిధులు ఖర్చు చేశారు. ఈ పనులకు సంబంధించి జరిగిన తనిఖీలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు గ్రామంలో లేకున్నా అనుకూనంగా వారి పేర్ల మీద పని కల్పించినట్లు మస్టర్లు వేసుకొని నగదును వారి ఖాతాలకు జమ చేయించి పంచుకున్నట్లు ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో బహిర్గత మయ్యింది. అలాగే చదువుకున్న వారు కూడా మస్టర్లలో వేలిముద్రలు వేసి ఉండటం, ఒకరే అన్ని సంతకాలు చేసి ఉండటం వంటి పొరపాట్లను గుర్తించారు. ముఖ్యంగా కొలతల్లో వ్యత్యాసాలను సిబ్బంది గుర్తించారు. ఈసీ, టీఏ, క్షేత్ర సహాయకులు వారికి ఇష్ట మొచ్చినట్లు వ్యవహరించారని గుర్తించారు. కుటుంబంలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క జాబ్‌కార్డు ఉండటం, పెండింగ్ కానివారికి జాబ్‌కార్డులు ఏర్పాటు చేయడం వంటి సమస్యలను గుర్తించారు. ఈ విధంగా మండలంలో రూ.6కోట్ల వరకు అవకతవకలు జరిగాయని తనిఖీ సిబ్బంది గ్రామాల్లో గుర్తించారు. బహిరంగ విచారణలో అధికారులు కేవలం రూ.97.26లక్షల వరకే రికవరీకి ఆదేశించారు. ఈ రికవరీని ఎవ్వరు చెల్లించాలన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికీ 16విడతలుగా తనిఖీ బహిరంగ విచారణ జరగ్గా ఇంతమొత్తంలో రికవరీకి ఆదేశంచడం ఇదే ప్రథమం.



బహిరంగ విచారణ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాస్థాయి పర్సనల్ హియరింగ్ తర్వాతనే తేలుతుంది

బహిరంగ విచారణ అనంతరం త్వరలో జిల్లాస్థాయిలో పర్సనల్ హియరింగ్ ఉంటుంది. అక్కడ సిబ్బందిని విచారించి ఎవరు నగదు రికవరీ చేయాలో ఆదేశాలివ్వడం జరుగుతుంది. వారి ఆదేశాల ప్రకారం రికవరీ నగదు చెల్లించాల్సి ఉంటుంది.

- చెంచయ్య, ఏపీవో, కొండాపురం

వరద బాధితులకు ఆర్థికసాయం



ఇంటూరికి చెక్కు ఇస్తున్న బ్రహ్మారెడ్డి

ఉలవపాడు, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితుల సహాయార్థం బద్దిపూడి టీడీపీ సీనియర్ నాయకులు కూనం బ్రహ్మారెడ్డి రూ.50వేలు, ఉలవపాడు జూనియర్ కాలేజి విద్యార్థులు, అధ్యాపకులు రూ.20,050, టీడీపీ నాయకులు బండి తిరుపతిరెడ్డి రూ.10వేలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య, సర్పంచ్ చేవూరి వెంకటేశ్వర్లు, పార్టీ మండలాధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కన్నాప్రసాదు, పోలు బోయిన శ్రీనివాసులు, చెంచురామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గుండెపోటుతో మరణించిన పార్టీ సీనియర్ నాయకులు గొల్లపోతు జాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

●**అల్లూరు :** విజయవాడ వరద బాధితులకు తమవంతు ఆర్థికసాయం అందించేందుకు అల్లూరు విక్రమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. శుక్రవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సమకూర్చిన రూ.36వేలను అపస్మా ప్రతినిధులు శివకుమార్, రాధాకృష్ణలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసులో చిన్నవారైనా వారు చేసిన సహాయం పెద్దదని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వంశీ ఉన్నారు.

నేడు గుడ్లూరులో ప్రజావేదిక

గుడ్లూరు, సెప్టెంబరు 20: వందరోజుల కొత్త ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి తెలియజేసే ప్రజావేదికను మండలకేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు నాగరాజు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

కలువాయి : బ్రాహ్మణపల్లిలో ఉదయం 10గంటలకు జరిగే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. మారంరెడ్డిపల్లి పంచాయతీలోని ఎస్సీ కాలనీలో శనివారం జరుగు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు తెలిపారు.

నిమిషం ఆలస్యమైనా చర్యలు

వలేటివారిపాలెం: విధులకు నిమిషం ఆలస్యమైనా చర్యలు తప్పవని నోడల్ ఆఫీసర్ మల్లికార్జున హెచ్చరించారు. చుండి మోడల్‌స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. టీచర్లు ఏ సమయానికి విధులకు హాజరయ్యారో ప్రిన్సిపాల్ వెంకటేశన్‌ను అడిగి తెలుసున్నారు. బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు.

కందుకూరు ఎస్‌ఐగా సాంబయ్య



కందుకూరు, సెప్టెంబరు 20: పట్టణ ఎస్‌ఐగా సాంబయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వలేటివారిపాలెం ఎస్‌ఐగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన సీఐ కె.వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మరో ఎస్‌ఐగా సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాని ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించేవారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తాం

జలదంకి, సెప్టెంబర్ 20: కొందరు వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని విమర్శలు చేస్తున్నారే తప్ప, వైద్యుడిగా తాను సిబ్బంది ఆరోగ్యకేంద్రానికి వారికి అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కాలంలో డాక్టర్లు, సిబ్బంది పనితీరు బాగోలేదన్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల ప్రజలు ఎవరూ ఆరోపణలు నమ్మవద్దన్నారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలని వినతి

కావలి టౌన్, సెప్టెంబరు 20: పట్టణంలో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య, నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దోమల నియంత్రణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పిల్లలు, పెద్దలు విషజ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్, వాంతులు విరేచనాలతో ఆసుపత్రుల చేరుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలుషితంలేని నీరు సరఫరా చేయాలని పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మధుసూధన్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 20: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం, నెల్లూరు ఏపీసీఎన్‌పి ఆధ్వర్యంలో ఆత్మకూరు, అనంతసాగరం, ఏయస్‌పేట మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయం ఒక్కరోజు శిక్షణా ఇచ్చారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 20: స్థానిక మున్సిపాలిటీలో కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ నుండి నెల్లూరుపాళెం వరకు 5కె రన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు నచ్చేలా చంద్రబాబు పాలన

కావలి, సెప్టెంబరు 20: రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన అద్భుతంగా సాగిందని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ 26వ వార్డు సౌత్‌జనతాపేటలో శుక్రవారం సాయంత్రం ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముందుగా రామాలయం వద్ద పూజలు చేసి 100రోజుల పాలనకు 100 కొబ్బరికాయలు కొట్టారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ పద్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సాధించిన విజయాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో ముసునూరు- కావలి గుంటల రోడ్డు, తీరప్రాంతంలోని కావలి-తుమ్మ లపెంట రోడ్డు, దగదర్తి-బుచ్చి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిమన్నారు.

కావ్య రెండో షేడు ఏదో చూపిస్తా..

కావ్య హైడ్రా స్టార్ట్ అయిందని ఇప్పటివరకు ఒక షేడే చూశారని రెండో షేడ్ ఏదో చూపిస్తానని ఎమ్మెల్యే ఉద్రేగభరితంగా మాట్లాడారు. పార్టీకి వెన్ను పోటు పొడిచిన వారు తెలుగుదేశం అని చెప్పుకుంటున్నారని తెలిపారు. కావలి అంతా టీడీపీకి మెజార్టీ వస్తే 26వ వార్డులో వైసీపీకి మెజార్టీ వచ్చిందని ఇక్కడ నాయకులు ఎక్కువ పనితక్కువ అన్నారు. ఇక్కడ పనికి రానివారు ఎక్కడెక్కడో తిరుగుతూ ఏదేదో చేస్తున్నారని చెప్పారు. ఇక నుంచి ఈ వార్డు ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లే అని ఆయనతోనే ఎవరైనా రావాలన్నారు. ఇది కావ్య అడ్డా అని గుర్తించుకోవాలన్నారు. ఇక్కడ ఉన్న ఒకే ఒక పార్టీ అని అది చంద్రబాబు తెలుగుదేశమే అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, నాయకులు గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, భరత్‌కుమార్, బ్రహ్మానందం, విఠల్ పాల్గొన్నారు.

మర్రిపాడు: ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన వందరోజులు సాగిందని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మర్రిపాడులోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలనలో చంద్రబాబుకు.. జగన్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పవిత్ర ప్రసాదమైన తిరుమల లడ్డూలో మధురమైన పదార్థాలు కలపకుండా తప్పులు జరిగాయని చంద్రబాబు ప్రభుత్వం విచారణ చేస్తుందే తప్పదురుద్దేశం వేరొకటి లేదని తెలిపారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని దాసరిపల్లిలో నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. దాసరిపల్లిలో త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మండల కన్వీనర్ బయ్యన్న, సర్పంచు గౌస్‌మొహిద్దీన్, మాజీ సర్పంచు జమృత్ జాఫర్ మొహిద్దీన్, మాజీ ఎంపీపీ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి చుండిలో పార్టీ కార్యకర్తలతో ఇంటింటికి తిరిగి వందరోజుల పాలనపై అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను చూపిస్తూ వివరించారు. చెరువుపల్లి సాంబశివరావు, వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

అల్లూరు: టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు నిరంజన్‌రెడ్డి పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో నాయకులతో ఇంటింటికి తిరిగి వందరోజుల పాలనలోని కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అల్లూరులో నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఉలవపాడు: నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కరేడు పంచాయతీ కొత్తపల్లెపాలెంలో మన ప్రభుత్వం-మంచి ప్రభుత్వంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. విజయవాడ వరద బాధితులను ముఖ్య మంత్రి చంద్రబాబు, కూటమి నాయకులు కంటికిరెప్పలా కాపాడిన విధానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

చేజర్ల: మాముడూరులో కూటమి నాయకులు, స్థానిక అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌డీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో, ఎంపీడీవో విజయలలిత, మండల కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి, బీజేపీ నాయకులు కుంకు బాలయ్య, సర్పంచ్ చిన్నయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: గణేశ్వరాపురంలో యువనాయకులు పేరం సుధాకర్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమీర్‌శర్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి సీతారామపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన నాయకులు గడపగడపకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భార్గవి, కార్యదర్శులు రాంనాధ్‌రెడ్డి, జీవన్, మండల ఆయకట్టు అధ్యక్షుడు రాజశేఖర్, దేవర వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కాశీరత్తయ్య (గాంధీ), సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: పోలినేనిపాలెం, రోళ్లపాడు, చుండి, మాలకొండ, పోలినేనిచెరువు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఇది మన ప్రభుత్వ 100రోజుల పాలనపై ఇంటింటా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, సర్పంచ్ అనుమోల అమరశ్వరి, మాదాల చిరంజీవి, మానికొండ కొండయ్య, శనివారపు మాల్యాద్రి పాల్గొన్నారు.




కావలి: కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



వరికుంటపాడు: ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



చేజర్ల: కరపత్రాలను పంపిణీ చేస్తున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కూటమి నాయకులు



మర్రిపాడు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, సెప్టెంబర్ 20: లింగరాజు అగ్రహారం సాగునీటి చెరువు అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. రూ.1. 50 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనులు నాణ్యత చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అంతకుమునుపు ఎమ్మెల్యేను గ్రామపొలిమేర్లలో సర్పంచ్ మంగళి తిరుమల ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చెత్తసంపద కేంద్రంను పరిశీలించి సతీమణి కాకర్ల ప్రవీణతో మొక్క నాటించారు. కార్యక్రమంలో నేతలు మధురెడ్డి, రామారావు ప్రవీణ్, మోహన్, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలి

ఉదయగిరి రూరల్: పార్టీలకతీతంగా ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. అసంపూర్తిగా ఉన్న ట్యాంక్‌బండ్‌ను శుక్రవారం ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ట్యాంక్‌బండ్ సుందరీకరణలో భాగంగా ఇప్పటి వరకు జరిగిన, చేయాల్సిన పనులపై జలవనరుల శాఖాధికారులతో మాట్లాడి సూచనలిచ్చారు. అలాగే పురాతన కృష్ణమందిరం సమీపంలో కోనేరు, కల్యాణ మండపాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులపై ఇరిగేషన్ అధికారులతో చర్చించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి పురాతన కట్టడాలను టూరిజం అధికారులతో మాట్లాడి అభివృద్ధి చేస్తామన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్, మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, నాయకులు బీ నరసింహులు, రాజా, నరసింహ, ఓబుల్‌రెడ్డి, కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్, వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను

ప్రైవేటుకు అప్పగించొద్దు : సీఐటీయూ



ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 20: డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్నెస్ టెస్ట్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై శుక్రవారం సీఐటీయూ అనుబంధ కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు ఆటోవర్కర్స్ యూనియన్ల నాయకులు కందుకూరు ఆర్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఎస్‌ఏ గౌస్, కొట్టే వెంకయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గడ్డం రాజేష్, కొట్టే పుల్లయ్య, అంబలకారి చిట్టిబాబు, అక్కెలగుంట జార్జి, కోటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

నేరాలపై విద్యార్థులకు అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 20: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సీఐ వెంకటేశ్వరావు మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, ఇతర వ్యవస్థీకృత నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పొంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు కూడా వీటిని అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారుల అపహరణలు, బాల్య వివాహాలు, నేరాలు-ఘోరాలు, రోడ్డు ప్రమాదాల్లో బాధితులుగా మారకుండా పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



నూతన దుస్తులతో విద్యార్థులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20: స్థానిక హైస్కూల్‌లోని 41మంది విద్యార్థులకు మాజీ సర్పంచ్ వలేటి ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రముఖ న్యాయవాది వలేటి శ్రీధర్‌నాయుడు,ప్రముఖ వ్యాపారవేత్త వలేటి మధు సూధన్‌రావులు శుక్రవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బరామయ్య, గ్రామస్థులు వలేటి నరసింహం, కాకుమాను హర్షకుమార్, కాకుమాను అంజనేయులు, గుత్తా మహేశ్వరరావు, గుత్తా కొండయ్య, గుత్తా తిరుపతయ్య, చుండూరి కోటేశ్వరరావు, వీరమోసు అంజయ్య పాల్గొన్నారు.

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20: జమీన్‌ఉప్పల పాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యార్థినులకు పోలినేనిపాలెం మాజీ సర్పంచ్ అనుమోల రాములు తల్లి అనుమోల ఆదెమ్మ జ్ఞాపకార్థం రూ.20వేల చెక్కు క్రీడా దుస్తుల కోసం ప్రత్యేకాధికారి గోవర్ధికి అందజేశారు. ఈ సందర్భంగా దాత రాములును టీచర్లు బృందం అభినందించారు.

చెరువుకు మరమ్మతు పనులు చేయాలి

సంగం, సెప్టెంబరు 20: మర్రిపాడు చెరువుకు మరమ్మతు పనులు చేయాలని రైతులు శుక్రవారం ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో చెరువు కట్టలు బలహీనపడి ప్రమాదకరంగా ఉందని, వర్షాలు రాకముందే చెరువుకు మరమ్మతు పనులు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు హరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

కావలిలో వర్షం.. చల్లబడిన వాతావరణం

కావలి, సెప్టెంబరు 20: పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటివర్షానికి వాతావరణం కొంత మేర చల్లబడింది. వేసవిని తలపించేలా ఉన్న ఎండలతో ఇబ్బందులు పడుతుంటే ఈ వర్షంతో జనాలు కొంత ఉపశమనం పొందారు.

తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతున్నారు

కొండాపురం, సెప్టెంబరు 20: గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టి వేధించిన వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అదేవిధంగా తప్పుడు కేసులు పెట్టి టీడీపీ సానుభూతి పరులను ఇబ్బందులు పెడుతున్నారని నేకునాంపేట ఎస్సీ కాలనీకి చెందిన నలగట్ల పావని, నాగేంద్రమ్మలు శుక్రవారం విలేకరుల ఎదుట వాపోయారు. వైసీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక గ్రామాలను వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నామని, కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి గ్రామానికి వచ్చామన్నారు. ఇటీవల జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలో నలగట్ల పావని, నాగేంద్రమ్మలను చైర్మన్లుగా ఎంపిక చేయడంతో జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు బలరామిరెడ్డి, జార్జిలు కాలనీకి చెందిన నలగట్ల రుక్మిణమ్మతో తిరిగి కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తప్పుడు కేసులపై విచారణ చేపట్టాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం/ ఉలవపాడు, సెప్టెంబరు 20: అన్నెబోయిన పల్లి మన్నేరు వాగు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్‌ఐ షేక్ మహమ్మద్ సుభానీ, సిబ్బంది అన్నెబోయినపల్లి మన్నేరు బ్రిడ్జిపై ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్ నిలిపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. అలాగే, ఉలవపాడులోని మన్నేరువాగులో అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు వచ్చిన 5ట్రాక్టర్లను స్టేషన్ తరలించిట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, సెప్టెంబరు 20: జేబీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో డాక్టర్ రామ్ సామాజిక సాంస్కృతిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలను మెడల్స్‌తో అభినందించారు. కార్యక్రమంలో విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి. రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, బీజేపీ నేత భరత్‌కుమార్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబు నాయుడు, నేతలు రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

ఆత్మకూరు : స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న బాల భవిత కేంద్రంలో పుట్టుకతో 12 రకాల లోపాలు ఉన్న 18 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందచేస్తామని స్థానిక వైద్యులు తెలిపారు. పుట్టుకతో కాళ్లు వంకర, గ్రహణమొర్రి, వినికిడి లోపం తదితర వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తారన్నారు.

క్రీడాస్ఫూర్తిని వెలికితీయడమే లక్ష్యం



అల్లూరు : ఆటలు ఆడుతున్న విద్యార్థులు

అల్లూరు, సెప్టెంబరు 20: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవోలు రవీంద్రనాథ్, సునీత తెలిపారు. శుక్రవారం అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల క్రీడా మైదానంలో వాలీబాల్, ఖోఖో, యోగా, బ్యాట్మింటన్, చెస్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీలు చంద్రశేఖర్, లావణ్య పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌లో శుక్రవారం ఆటల పోటీలు పోటాపోటీగా జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 విభాగాలలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. శనివారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు ప్రారంభం

●**ఉదయగిరి రూరల్:** మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు మండల కోఆర్డినేటర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బాల్‌బాడ్మింటన్‌కు సంబంధించి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఈనెల 23 నుంచి 25వరకు నియోజకవర్గ స్థాయి పోటీలు వింజమూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజ్, పీడీ వాసు, గండిపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు : డీఎస్పీ

- పత్రాలు లేని 40 బైక్‌లు, 4 ఆటోల స్వాధీనం



కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

కావలి రూరల్, సెప్టెంబరు 20: ఎస్పీ ఆదేశాల మేరకు నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్, తుఫాన్‌నగర్, బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో శుక్రవారం కార్డన్‌సర్చ్ నిర్వహించారు. పట్టణ 1వ, 2వ పట్టణ, రూరల్ సీఐలు ఫిరోజ్, కొండవీటి శ్రీనివాసరావు, ఎస్‌ఐలు రాజేశ్వరరావు, పాపారావులు స్పెషల్‌పార్టీ సిబ్బందితో 1500ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 40 బైక్‌లు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. 20మంది రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాటాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 20: పీఎం విశ్వకర్మ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నెల్లూరు రీజనల్ కార్యాలయ చీఫ్ మేనేజరు ఆంజనేయులు అన్నారు. ఉదయగిరిలోని బ్యాంకు శాఖలో శుక్రవారం లబ్ధిదారులతో రుణ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు చంద్రమౌళి, సహాయ మేనేజరు ధనబాబు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, పీఎం విశ్వకర్మ ప్రథమ వార్షికోత్సవ సంబరాలను స్థానిక నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాక్ ద్వారా శిక్షణ పొందిన పలువురు అభ్యర్థులకు ఎంపీడీవో ఈశ్వరమ్మ ధృవపత్రాలను పంపిణీ చేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 20 : మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేరోజు ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, మండవ మురళి, సీనియర్ నాయకుడు సన్నమూరి నరసింహారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



సాగు, తాగునీటి సమస్యలను తీర్చాలి

- సీఎం చంద్రబాబును కోరిన

ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉన్న సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. అలాగే పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో శుక్రవారం జరిగిన గ్రామసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బీఎన్ పలు అంశాలను తీసుకెళ్లారు. ఎన్‌జీపాడు, మద్దిపాడు మండలాల్లో గుండ్లకమ్మనది ప్రవహిస్తున్న అనేక గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందడం లేదన్నారు. వాటి పరిష్కారం కోసం గుండ్లకమ్మనదిపై రెండు చోట్ల చెక్ డ్యామ్‌లను గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేయగా వైసీపీ వచ్చాక పట్టించుకోలేదని చెప్పారు. అందువల్ల ఆ రెండు చెక్‌డ్యామ్‌లను తక్షణం నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలాగే నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకం పనులు, సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల మెరుగుకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. అదే సమయంలో ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గం నుంచి నాలుగు జాతీయ రహదారులు వెళ్తున్నాయని, వాటన్నింటిని కలుపుతూ ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణం చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని బీఎన్ వినతి చేశారు.



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

టంగుటూరు మాజీ సర్పంచ్ జయంత్‌బాబు

ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు ప్రారంభం

టంగుటూరు, సెప్టెంబరు 20 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం తులసీప్రభ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతోపాటు, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. మండల విద్యాశాఖాధికారులు చెంచుపున్నయ్య, బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోటీల్లో పాల్గొనే 250 మంది విద్యార్థులకు రెండు రోజులకు అవసరమైన తాగునీరు, భోజన సదుపాయాలను జయంత్‌బాబు సమకూర్చనున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజవాడ వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నేత దామచర్ల శ్రీధర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ యరమాల అరుణ, తుల్లిబిల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలను నిర్వహించారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో-2 పి. రామారావు, హెచ్‌ఎంలు

కె.ఉప్పలపాడులో..

కొండపి : మండల స్థాయి బాలుర ఆటల పోటీలను ఎంఈవో-2 పి.రామారావు కె.ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. అండర్-17 విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పోటీల మండల కోఆర్డినేటర్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సునన్నకుమార్, భారతి, వ్యాయామ ఉపాధ్యాయులు, జడ్పీస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నలమోతు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ముసికి సాగర్ నీరిచ్చి రైతులను ఆదుకోవాలి

కొండపి, సెప్టెంబరు 20 : ముసికి సాగర్ నీరు ఇచ్చి కొండపి ప్రాంత రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. సాగర్ నీటి సాధన కోసం ఈనెల 25న కొండపిలో నిర్వహిస్తున్న సదస్సుకు జన సమీకరణలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని పెరిదేపి, మిట్టపాలెం, ముప్పవరం, కొండపితోపాటు పలుగ్రామాల్లో రైతులను కలిసి కరపత్ర ప్రచారం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తుతుంటే కొండపి ప్రాంతంలో చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదన్నారు. ఈనేపథ్యంలో ముసికి సాగర్ నీరు ఇస్తేనే ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు ఐక్యంగా కదిలి సదస్సులో పాల్గొనడంతోపాటు భవిష్యత్‌లో జరిగే ఉద్యమాలకు కూడా మద్దతుగా నిలవాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, రైతు సంఘం నాయకులు ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, పుట్టా రామారావు, కొల్లూరి బాలయ్య, కామని బ్రహ్మయ్య, కోటపాటి రమణయ్య, చెన్నారెడ్డి కోటయ్య, మల్లెల కొండయ్య, కోయి శేషయ్య, గడ్డం వందనం, చంబేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్ర ప్రచారం నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు



సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ వినియోగం

గుంటూరు రేంజి ఐజీ స్వీయ పర్యవేక్షణ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 20 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. గురువారం రాత్రికి ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో ఆగమేఘాల మీద భద్రత చర్యలు చేపట్టారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ విధానం ద్వారా అన్ని శాఖలను సమన్వయం చేసుకొని భద్రత చర్యలు చేపట్టారు. చదలవాడలోని సాయి విష్ణు విల్లాస్ చతుర్వాటికలో హెలిప్యాడ్ ఉండటంతో అక్కడ ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి సుమారు ఒక కిలో మీటరు దూరం మద్దిరాలపాడు ఉండటంతో రోడ్డుకు ఇరువైపులా ముందస్తు తనిఖీలు చేశారు. అదేవిధంగా మద్దిరాలపాడులోని మూడు గృహాలకు సీఎం స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అందుకు సంబంధించిన భద్రత చర్యలతోపాటుగా రోప్ పార్టీలను వినియోగించి గుంపులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సుమారుగా ఆరు వందల మందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. సీఎంకు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉండటంతో ఎస్ఎస్‌జీ కమాండర్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎక్కడా హడావుడి చేసిన దాఖలాలు కనిపించలేదు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సీఎం కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. భద్రత ఏర్పాట్లలో గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ ఏఆర్. దామోదర్ స్వీయ పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. పోలీసు శాఖతో పాటుగా ఇతర శాఖలను సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు. భద్రతా చర్యలలో పాల్గొన్న సిబ్బందికి, అధికారులకు అభినందనలు తెలిపారు.



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ

సీఎం పర్యటన మూడు గంటలు

సాదర స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 20: మద్దిరాలపాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు గంటల పాటు పాల్గొన్నారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో సాయివిష్ణు విల్లాస్ చతుర్వాటికలో హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డి.బాలవీరాంజనేయస్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బీఎన్.విజయకుమార్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు దామచర్ల సత్య, గరటయ్య, నూకసాని బాలాజీ, కలెక్టర్ తమీమ్ అన్సారీ, గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ ఆర్.దామోదర్ తదితర నాయకులు ఘనస్వాగతం పలికారు. 2.32 నిమిషాలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగి సభాస్థలికి ప్రత్యేక బస్సులో బయలుదేరారు. ఆయన వెంట ప్రధాన కార్యాదర్శి నీరబ్‌కుమార్ ఉన్నారు. గ్రామంలో మూడు కుటుంబాల వారితో ముఖాముఖి మాట్లాడి ప్రభుత్వ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మద్దిరాలపాడులో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించి తిరిగి హెలిప్యాడ్ వద్దకు 5.30కు వచ్చి మంగళగిరి తిరిగి వెళ్లారు. మూడు గంటల పాటు మద్దిరాలపాడులో ప్రజలతో మాట్లాడటంతో పాటు సభలో ప్రజల ప్రభుత్వ పని విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే బీఎన్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.